14న సాగునీటి సంఘాల ఎన్నికలు

ఏలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది. జిల్లా వ్యాప్తంగా 356 సాగునీటి సంఘాలు ఉండగా 14పైగా డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మరో రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. మొదట సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయి.



ద్వారకాతిరుమలలో మూతపడిన ఓ సిరామిక్ పరిశ్రమ

సిరామిక్ పార్క్ ఏమైంది?

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు.. వైసీపీ పాలనలో బుట్టదాఖలు



ద్వారకాతిరుమల చిన వెంకన్న కొలువైన ప్రాంతం. ఈ ప్రాంతంలోనే నాణ్యతతో కూడిన సుద్ద గనులు ఉన్నాయి. సిరామిక్ పరిశ్రమ అభివృద్ధి చేయడం ద్వారా నాణ్యతతో కూడిన టైల్స్ ఉత్పత్తులే కాకుండా వందలాది మందికి ఉపాధి లభిస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని 2014లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ సిరామిక్ పార్కు ఏర్పాటుకు నిర్ణయించింది. తదనుగుణంగా కొన్ని విదేశీ సంస్థలు ఇక్కడికి వచ్చి అధికారులతో సంప్రదింపులు జరిపాయి. తర్వాత ఐదేళ్ల జగన్ ప్రభుత్వం మాత్రం సిరామిక్ ఊసే ఎత్తలేదు. ఆవైపు తొంగిచూడలేదు. స్థానికులు, యువతకు ఉపాధిని ప్రోత్సహించలేదు. దీనికితోడు గనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

- ఉపాధి అవకాశాల కల్పనకు అప్పట్లో కార్యాచరణ
- వైసీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యం
- సుద్ద గనులపైనా కన్నేసి వేధించారు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ చిగురించిన ఆశలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి అప్పటి ప్రభుత్వం చర్యలు చేపడితే.. తర్వాతి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. స్థానిక వనరులను సద్వినియోగం చేయడానికి 2014-19లో టీడీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పనిచేసింది. ఎక్కడ వనరులు ఉంటాయో గుర్తించి వాటిని సద్వినియోగపర్చుకునే దిశగా అడుగులు వేశారు. అందుబాటులో ఉన్న గనుల వివరాలను బహిర్గతం చేశారు. ఆఖరుకు ఆంధ్రప్రదేశ్ మైనింగ్ కార్పొరేషన్ పరిధిలో ఒక సుద్ద గని(బాల్‌క్లే)ని ప్రోత్సహించారు. ద్వారకాతిరుమలలో నాణ్యతతో కూడిన సుద్ద దాదాపు పది గనుల్లో లభ్యమయ్యేది. వీటి ఆధారంగానే ద్వారకా తిరుమల, పరిసరాల్లో కూడా స్థానికులు కొందరు సిరామిక్ చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చారు. అప్పట్లో పదికిపైగా ఉన్న గనుల్లో సుద్ద లభ్యత సంతృప్తికరంగా ఉండేది. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం వీటిని గమనించి స్థానికంగా ఉపాధి మెరుగుపర్చడమే కాకుండా ఇక్కడి నుంచి సిరామిక్ ఉత్పత్తుల తయారీ, అమ్మకాలను ప్రోత్సహించడం ద్వారా సిరామిక్ పరిశ్రమను భారీగా విస్తరించాలని ప్రణాళిక రూపొందించారు. ఎక్కడికక్కడ సుద్ద గనులు అందుబాటులో ఉండడం, ఉన్న వనరులు, ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సాధ్యమైనంత వివరణాత్మకంగా ప్రచారం కల్పించారు. ద్వారకాతిరుమల వెంకన్న నిలయమే కాకుండా సుద్ద గనులకు ఎంతో ప్రసిద్ధి అనే విషయం అప్పట్లో బాహ్య ప్రపంచానికి తెలిసింది. దీనిని దృష్టిలో పెట్టుకుని కొందరు విదేశీ ప్రతినిధులు సైతం అప్పట్లో ద్వారకాతిరుమలకు వచ్చి జిల్లా అధికారులతో సంప్రదించారు. ప్రభుత్వం ద్వారకాతిరుమలను సిరామిక్ పార్కుగా అభివృద్ధి చేయాలని సంకల్పంతో ఉందని, దీనికి అనుగుణంగా భీమడోలు, ద్వారకాతిరుమల ప్రాంతంలో కొత్త గనుల కోసం మరింత అన్వేషణ కూడా జరుపుతామని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు యంత్రాంగం ఉప్పందించింది. ప్రత్యక్షంగా పెట్టుబడులకు దిగితే ప్రభుత్వ ప్రోత్సాహం భారీగా ఉంటుందనే విషయాన్ని తేల్చి చెప్పారు. సుద్ద గనులు దగ్గరగా ఉండడంతో వీలైతే జి.కొత్తపల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతాన్ని సేకరించి ఆ మేరకు అక్కడ సిరామిక్ పార్కు ఏర్పాటు చేయబోతున్నట్టు అప్పట్లో ప్రకటించారు. ఇదే విషయాన్ని అప్పటి సీఎంగా ఉన్న చంద్రబాబు సైతం పలు సందర్భాల్లో ఉటంగించారు కూడా. ఇంకేముంది స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని అప్పట్లో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. శుద్ధ గనులను లీజుకు తీసుకున్న వారంతా ఇతర ప్రాంతాలకు రవాణా చేసేదానికంటే స్థానికంగానే సిరామిక్ ఉత్పత్తుల ప్రోత్సాహానికి నాణ్యమైన సుద్దను అందించవచ్చని సంతృప్తిపడ్డారు.

వైసీపీ దెబ్బతో సిరామిక్ ముక్కలు

ద్వారకాతిరుమలలో సిరామిక్ పరిశ్రమలను ప్రోత్సహించాలని, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలనుకున్న ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రణాళిక కాస్తా వైసీపీ ప్రభుత్వ హయాంలో గాలికి కొట్టుకుపోయింది. ఎక్కడికక్కడే ప్రణాళికను, ప్రతిపాదనలు మూలనపడేశారు. ఒకప్పుడు రాజమహేంద్రవరం, కడప జిల్లా మందలూరు, పల్నాడు జిల్లా మాచర్ల, తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం వద్ద నాణ్యమైన సుద్ద గనులు ఉండేవి. కాని రాజకీయ కారణాలతో సుద్ద గనులపై వైసీపీ కన్నేసింది. తమకు వ్యతిరేకంగా ఉన్న వారి గనులను రెన్యువల్ చేయకుండా అడ్డుకుంది. దీంతో ఒక్క ద్వారకాతిరుమలలోనే ఆరు గనులు మూతపడగా మూడు గనులు మాత్రం అంతోఇంతో సుద్ద తవ్వి తీశారు. ఏపీఎండీసీ పరిధిలో ఉన్న మరొక గనిలో కూడా సుద్ద తవ్వకాలు సాగాయి. ఒకవైపు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అప్పటివరకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాలకు సుద్ద రవాణా జరగ్గా ప్రస్తుతం అది తిరుపతి, పెద్దాపురం, నారాయణపురానికే పరిమితమైంది.

ప్రతిపాదనలు పట్టాలెక్కిస్తారా

తెలుగుదేశం ప్రభుత్వంలో సిరామిక్ పార్కుపై స్థానికులు కోటి ఆశలు పెంచుకున్నారు. కళ్లెదుటే ఉపాధి సాక్షాత్కరించబోతుందని యువత కలలు కన్నారు. వైసీపీ పాలనలో కలలన్నీ చెదిరిపోవడంతో స్థానికులు తీవ్ర మనోవ్యధ చెందారు. ఇక్కడ లభించే సుద్దతో వాల్ టైల్స్, రూఫ్ టైల్స్, శానిటరి సామాగ్రితో పాటు పొగాకు బ్యారెన్ల నిర్మాణంలో ఉపయోగించే కొన్ని ఇటుకలను ఇక్కడి నుంచే ఇంతకుముందు చిన్న చిన్న యూనిట్‌లలో తయారు చేసేవారు. ఒకప్పుడు టన్ను సుద్ద రూ.800 నుంచి రూ.950 వరకు ధర పలకగా అది కాస్తా చాలా వరకు గందరగోళంలో పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తామని, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని ప్రకటించింది. ఎక్కడ వీలైతే అక్కడ పరిశ్రమలకు అనువైన పరిస్థితులను సృష్టించాలని యంత్రాంగాన్ని ఆదేశించింది. ద్వారకాతిరుమలలో ప్రతిపాదించిన సిరామిక్ పార్కుకు తిరిగి జీవం పోస్తారన్న ఆశతోనే స్థానికులు ఉన్నారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో నిరుద్యోగం పెరగ్గా, ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. సిరామిక్ పరిశ్రమను ప్రోత్సహిస్తే వేల మందికి ప్రత్యక్ష ఉపాధి కలుగుతుంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యానికి పరీక్ష



నేటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టెస్ట్

జిల్లావ్యాప్తంగా పరీక్షలు

నిడమర్రు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మదింపు కోసం ప్రభుత్వం సమ్మేటివ్ పరీక్షలకు ఏర్పాట్లు చేసింది. విద్యాసంవత్సరం ప్రారంభమై 6 నెలలు కావడంతో సిలబస్ సగంపైగా పూర్తికావచ్చింది. నవంబరు వరకు పూర్తయిన సిలబస్ ఆధారంగా అభ్యసన సామర్థ్యాలపై మంగళవారం నుంచి ఈ పరీక్షలు జరుగుతాయి. డీసీఈబీ ప్రశ్నపత్రాలు ముద్రించి ఆయా మండలాలకు పంపిణీ చేసింది.

విద్యాసంవత్సరంలో రెండు నెలలకోసారి నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలను ఇప్పటికి రెండుస్లార్లు నిర్వహించారు. ఫార్మేటివ్ పరీక్షలు అనంతరం సెల్ఫ్ అసెస్మెంట్ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులలో మార్కులు నమోదు చేస్తారు. నవంబరులో నిర్వహించాల్సిన సమ్మేటివ్ పరీక్షలు (టెస్ట్-1) వాయిదా పడడంతో మంగళవారం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 19 వరకు పరీక్షలు జరుగుతాయి.

నిర్వహణా ఇబ్బందులు

పరీక్షల నిర్వహణ ఉపాధ్యాయులకు భారంగా మారింది. పరీక్షలకు గంట ముందు మాత్రమే మండల వనరుల కేంద్రాలు, కాంప్లెక్స్ హైస్కూల్స్‌లో ప్రశ్నాపత్రాలను ఎంఈవోలు, హెచ్ఎంలు అందజేస్తారు. ఉపాధ్యాయులు హడావుడిగా పాఠశాలల నుంచి వెళ్లి ప్రశ్నాపత్రాలను తెచ్చుకోవాలి. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు, కాంప్లెక్స్‌కు సుదూర పాఠశాలల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం



సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పరీక్ష -1కు సర్వం సిద్ధం చేశాం. ఇప్పటికే డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రాలు మండల కేంద్రాలకు, అక్కడి నుంచి స్కూల్ కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలకు చేరాయి. పరీక్షకు ఒక గంట ముందు మాత్రమే పరీక్షా పత్రాలను పాఠశాలల ఉపాధ్యాయులకు అందిస్తాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు, హెచ్ఎంలకు ఆదేశాలు ఇచ్చాము.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

కొఠారు ఇంటి వద్ద వంటా వార్పుతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కొల్లేటి లంక వాసులు

నాలుగో రోజు కొనసాగిన కొల్లేటివాసుల ఆందోళన

పెదవేగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి స్వగ్రామం కొండలరావుపాలెంలోని ఆయన స్వగృహం దగ్గర కొల్లేటి లంకగ్రామాల వారు మంగళవారం వంటా వార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. పైడిచింతపాడు, తిమ్మావారిగూడెం, మానూరు. లింగారావుగూడెం గ్రామాల ప్రజలు నాలుగో రోజు ఆందోళనలో పాల్గొన్నారు. కొఠారు ఇంటి ఎదురుగా వంటా వార్పు చేపట్టి, అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. ఆయా గ్రామాల నాయకులు మాట్లాడుతూ కొఠారు అబ్బయ్యచౌదరి 2019-24 సంవత్సరాల మధ్య అధికారాన్ని అడ్డుపెట్టుకుని తమ చెరువుల ఆదాయాన్ని బొక్కేశారన్నారు. కౌలు సొమ్ము ఇస్తామని తన చుట్టూ తిప్పుకుని, ఆపై తండ్రీ, కొడుకులిద్దరూ ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాకు రావాల్సిన సొమ్ము ఇచ్చేవరకు వదిలిపెట్టబోమని, ఎన్ని కష్టాలు ఎదురైనా ఆందోళన కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతల రవి, సైదు సత్యనారాయణ, మండలి రాజేంద్రప్రసాద్, ఘంటసాల కాసులు, కొరపాటి రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఉరుకులు పరుగులు



- వర్షాల హెచ్చరికతో రైతుల్లో ఆందోళన
- హడావుడిగా వరి మాసూళ్లు

ఏలూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో రైతులు పరుగులు పెడుతున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ప్రస్తుతం వర్షా లు లేకున్నా ముసురు వాతావరణంలో హడావుడిగా వరి మాసూళ్లు చేస్తున్నారు. జిల్లాలో 1.91 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు 1.16 లక్షల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. 15,612 మెట్రిక్ టన్నుల ధాన్యం రహదారులపై రైతులు ఆరబోశారు. మిగిలిన పంటలో కొంత కల్లాలు, మరి కొంత కుప్పలపై ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 1.99 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వర్షాల నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. ఉన్నఫళంగా మబ్బులు పట్టి వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నాయని చెబుతున్నారు. ప్రస్తుతం 15,612 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రహదారులపై ఆరబోయగా 13,653.8 మెట్రిక్ టన్నుల ధాన్యం కుప్పలపై ఉంది. వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ధాన్యం రక్షణ రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు.



ప్రగతివైపు అడుగులు

- నేటి నుంచి రెండు రోజులపాటు కలెక్టర్ల కాన్ఫరెన్స్ • పురోగతి సూచికలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వివిధ పథకాల్లో పురోగతి, అమలు, మిగతా అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశ నిర్దేశం చేయబోతున్నారు. బుధవారం, గురువారం జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ దీనికి వేదిక కానుంది. ఇప్పటిదాకా ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల అమలు, పురోగతిపై స్పష్టమైన సూచికలతో కలెక్టర్లతో చర్చించడమే కాకుండా ఆ మేరకు త్వరితగతిన ఫలితాలు ప్రజలు సంతృప్తిపడేవిధంగా చూసే బాధ్యతను కలెక్టర్లకు అప్పచెప్పనున్నారు. వివిధ శాఖల వారీగా అనేక సూచికలను కలెక్టర్లకు అందిస్తున్నారు. ఆయా శాఖల్లో పురోగతి, వెనుకబాటు సూచికల్లో స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రాధాన్యతక్రమంలో చేపడుతున్న చర్యలు, ఫలితాలపై కూడా తగిన నివేదికలో పొందుపరిచారు.

- వంద రోజుల కార్యాచరణతో గుంతలుపడిన రోడ్లకు మరమ్మతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు పనులు కూడా చేపట్టింది. ఏలూరు జిల్లాలో 948 పనులను గుర్తించగా 609 పనులను 64.2 శాతం మేర చేయగలిగారు. 336 పనులను సంక్రాంతిలోపు పూర్తి చేయాల్సి ఉంది.
- అన్న క్యాంటీన్లను జిల్లా వ్యాప్తంగా ఆరు చోట్ల నిర్వహిస్తూ పేదలకు ఆకలి తీరుస్తున్నట్టు ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది.
- ఆరేళ్ల లోపు చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయాలని భావించగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 43,524 మందిని గుర్తించి వీరిలో 41,803 మందికి ఆధార్ వర్తింపచేయగలిగారు.
- రాష్ట్ర వ్యాప్తంగా సహకార సంఘాలను కంప్యూటరీకరించాలని ప్రభుత్వం సంకల్పించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 159 సహకార సంఘాల్లో ఆ దిశగా అడుగులు వేసింది. ఇప్పటిదాకా 154 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి చేయడం ద్వారా 97 శాతం మేర లక్ష్యాలను అందుకోగలిగింది.
- పాడిపరిశ్రమ అభివృద్ధి చెందేలా ఆ దిశగా కొన్ని ప్రణాళికలు రూపొందించారు. 900పైగా గోకులంలను ఏర్పాటు చేయాలని భావించగా ఇప్పటివరకు 822 స్థాపించగలిగారు. ఈ లక్ష్యాలను పూర్తిగా అందుకునేందుకు మరికొద్ది రోజులు పడుతుందని భావిస్తున్నారు.
- పల్లెపండుగ కింద జిల్లా వ్యాప్తంగా 1062 రోడ్లను అభివృద్ధి చేయాలని సంకల్పించగా వీటిలో ఇప్పటికే 1025 పనులు ప్రారంభమయ్యాయి. అంటే 96.52 శాతం మేర పనులు పూర్తికావచ్చినట్టే. ఉపాధి హామీ పథకం కింద పంచాయతీరాజ్ శాఖ దెబ్బతిన్న మార్గాలన్నింటినీ గుర్తించి పల్లెల్లో రహదారుల సమస్యలను తొలగించే క్రమంలోనే పల్లెపండుగ పేరిట ఉపాధికి ఉపక్రమించింది. ఈ దిశగా అడుగులు పడినట్టయ్యింది.
- స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా జిల్లాలోని 627 గ్రామాల్లో బహిరంగ మల విసర్జన లేకుండా చేయగలిగారు. స్థానికుల సహకారం, అధికారుల చొరవతో సాధ్యమైంది.
- జిల్లా వ్యాప్తంగా 1576.76 ఎకరాలు అటవీ భూమి నోటిపై అయ్యింది. వ్యవసాయం, ఉద్యానవన పంటలు అభివృద్ధి విషయంలోను తాము తగు ప్రాధాన్యత ఇచ్చినట్టు, ఇప్పటికే తగినంత పురోగతి సాధించగలిగినట్టు కూటమి ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.
- తప్పిపోయిన పౌరుల వివరాలను ప్రస్తావిస్తూ వీరిలో 89.40 శాతం మందిని గుర్తించి వారి స్వగృహాలకు చేర్చగలిగామని ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.
- విలేజ్, వార్డు సచివాలయాలను ప్రస్తావించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 72 మందిని డిప్యుటేషన్‌పై ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు. రహదారులు, తాగునీరు, విద్యా, గృహ వసతి, పెన్షన్లు, పౌర సరఫరాలు, ధాన్యం సేకరణ వంటి అంశాల్లో గడిచిన కొన్ని మాసాలుగా ఉన్న స్థితిగతులను వివరించారు.

దిశా నిర్దేశమే లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలు కావడంతో ఇప్పటి వరకు సాధించిన ప్రగతి, ఇకపై తగినంత పురోగతి సాధించాలనే సంకల్పంతో ఉంది. ఈ మేరకు నేడు, రేపు రెండు రోజులపాటు కలెక్టర్లతో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశ, నిర్దేశం చేయబోతున్నారు. ఏలూరు జిల్లా నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి సమావేశానికి హాజరవుతున్నారు. ప్రాధాన్యత కలిగిన శాఖలే కాకుండా మిగతా వాటిలో కూడా సాధించాల్సి పురోగతి, ఏ అంశాలు క్రోడీకరించుకోవాలి, పరస్పర సహకారం, సమన్వయం, ఫలితాలు రాబట్టడంలో సంక్లిష్టత నుంచి ఎలా బయటపడాలో స్పష్టమైన సంకేతాలను కలెక్టర్లకు ప్రభుత్వం ఇవ్వనుంది. ఇప్పటికే సాగునీరు, ధాన్యం సేకరణ, వ్యవసాయం, విద్య సంక్షేమంలో పురోగతి కనిపిస్తుండగా, ఇకముందు ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు ప్రజలకు చేరువయ్యేలా జాగ్రత్తపడబోతున్నారు. ఆ దిశగా కలెక్టర్లకు సూచనలు చేస్తారని సమాచారం.



నూజివీడులో జగనన్న కాలనీలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ బృందం

జగనన్న కాలనీలపై విజిలెన్స్

- ఇళ్ల నిర్మాణాలపై ఆరా
- కాలనీల్లో సౌకర్యాల పరిశీలన

ముసునూరు/నూజివీడు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేపట్టారు. ప్రారంభమయ్యాయి. లేఅవుట్లు నివాసయోగ్యంగా ఉన్నాయా, సౌకర్యాలు, కట్టిన ఇళ్లు, ఇళ్ల నిర్మాణాలు జరగకపోవడానికి గల కారణాలపై సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. ముసునూరు మండలంలోని రమణక్కపేట, చింతలవల్లి, లోపూడి, గుళ్ళపూడి జగనన్నకాలనీ లేఅవుట్లను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఈ శ్రీనివాస్ క్షేత్రస్థాయి మంగళవారం తనిఖీ చేశారు. 222 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, 8మంది మాత్రమే ఇళ్లు కట్టుకున్నారని, విద్యుత్, రోడ్లు సౌకర్యాలు మాత్రమే ఉన్నాయని, నీటి సౌకర్యానికి బోరు లేదని హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు తెలిపారు. లోపూడి లేఅవుట్‌లో 111మందికి పట్టాలు ఇవ్వగా, 10 ఇళ్ల నిర్మాణం జరిగిందని, ఇక్కడ నీటి సౌకర్యం లేదన్నారు. చింతలవల్లిలో రెండు లేఅవుట్‌ల్లో 322 పట్టాలు, గుళ్ళపూడిలో ఒక లేఅవుట్‌లో 184 పట్టాలు ఇవ్వగా ఈ లేఅవుట్‌ల్లో ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఒక్క ఇంటి నిర్మాణం కూడా జరుగలేదని తెలిపారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఆర్ఐ దీపిక, వీఆర్వో రవికాంత్, పంచాయితీ కార్యదర్శి నాగబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు పట్టణంలో ఎమ్మార్ అప్పారావు కాలనీ, అన్నవరం పరిధిలోని జగనన్న కాలనీలను డీఈ శ్రీనివాసన్, ఏఈఈ రూపేష్ వర్మ, అనిల్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

• పది మంది అరెస్టు • మరొకరి కోసం గాలింపు
• 19 గంజాయి లిక్విడ్ బాటిళ్లు స్వాధీనం

నలుగురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

రూ.88,73,500 చోరీ సొత్తు స్వాధీనం

శబరిమలకు ప్రత్యేక రైళ్లు

7

ఆంధ్రజ్యోతి

ఫుల్‌టైమ్/పార్ట్‌టైమ్ విలేకరులు కావలెను

1.ఏలూరు (స్టాఫర్), 2. జంగారెడ్డిగూడెం రూరల్, 3.చింతలపూడి రూరల్ 4. నూజివీడు రూరల్, 5.ఆగిరిపల్లి, 6. తాడేపల్లిగూడెం టౌన్, 7. వీరవాసరం, 8. తణుకు రూరల్

ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.

అభ్యర్థులు ఇంటర్ / డిగ్రీ చదివి వుండాలి.

తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం,

సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి.

పైన పేర్కొన్న అర్హతలున్న అభ్యర్థులు

తేది 12-12-2024 (గురువారం)

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో ఉదయం 10-00 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

అడ్రస్ : ఆంధ్రజ్యోతి కార్యాలయం

రాచర్ల రోడ్డు, అలంపురం,

తాడేపల్లిగూడెం. ఫోన్ : 08818 -280013

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 8వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC,థానే బేలాపూర్ రోడ్,మస్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న ఋణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన ఋణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని ఋణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో దేనినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTION DATE 18.12.2024,SHRIRAM FINANCE LTD,D.NO 22B-13-8, 1ST FLOOR, VENKATARAMA POWER PRESS ROAD, OPP CENTRAL BANK POWER PETA,ELURU-534002

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
ELRUBPJ2403060001	DONTHASETTI NAVEEN		

.AUCTION DATE : 18.12.2024,SHRIRAM FINANCE LTD,DNO.20-44, UPSTAIRS OF ANDHRA BANK, NEAR CHINA GANDHI BOMMA CENTRE, NUZVID-521 201

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CTLPIPJ2403060008	KONAKALLA SURESH	CTLPIPJ2406060002	GAMIDELLI RAJU
CTLPIPJ2406260002	GAMIDELLI RAJU		

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ డి.రఘు రామరాజు, ను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 09.12.2024

స్థలం: రాజమండ్రి

అధీకృత అధికారి

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

చెట్టు పేరు చెప్పగలరా..!



పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద 400 ఏళ్ల నాటి చెట్టు

ఆచంట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదమల్లం మాచేనమ్మ ఆలయం వద్ద ఉన్న ఈ చెట్టు పేరు చెప్పగలరా.. మేం చెప్పగలం అంటూ ముందుకు వచ్చారా ఓడిపోతారు జాగ్రత్త. ఈ చెట్టు ఈనాటిది కాదండోయ్... సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటిది.. ఎవరిని అడిగినా దాని పేరు చెప్పలేకపోయారు. ఆ చెట్టు చూసి దానిపేరు కనుక్కోవాలని ఉందా..అయితే ఒకసారి ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ ఆలయానికి వెళ్లాలి.. అక్కడ ఈ చెట్టు ఉంది. ప్రచారంలో ఉన్న ఈ చెట్టు కథేంటో తెలుసుకుందాం.. పెదమల్లం గ్రామానికి చెందిన మాచేనమ్మ భర్త తన శిష్యులతో పుణ్య క్షేత్రాలకు కాశీ వెళ్లాడు. కాశీ నుంచి వచ్చిన తరువాత అమ్మవారు చిన్న పాపతో ఉంటుంది. కాశీ నుంచి వచ్చిన భర్త అమ్మవారిని ఈ పాప ఎలా పుట్టిందని ప్రశ్నిస్తాడు. తన భర్త అనుమానిస్తున్నాడని తెలుసుకున్న అమ్మవారు.. తన పుట్టిల్లయిన పెదమల్లం గ్రామానికి భర్త తీసుకెళ్ళే సమయంలో వశిష్ట గోదావరి ఒడ్డున తన పాపతో భూదేవిని తనకు కొంత చోటు ఇస్తే భూమిలో కలిసిపోతానని తలుచకుని పాపతో సహా భూమిలోకి దిగిపోతుంది. అది గమనించిన భర్త అమ్మవారిని ఏ విధంగా రక్షించాలో తెలియక జుట్టుపట్టుకుని పైకి లాగగా భర్త చేతి లోకి అమ్మవారి జుట్టు వస్తుంది. ఈ జుట్టును పక్కకు విసిరేసి అతను వెళ్ళిపోగా తరువాత కొంత కాలానికి జుట్టు విసిరిన ప్రదేశం నుంచి కొన్ని వృక్షాలు మొలిచాయి. మొదట్లో అనేక వృక్షాలు ఉండగా ప్రస్తుతం ఒక వృక్షమే ఉంది. ఈ వృక్షమే అప్పటి నుంచి పేరులేని చెట్టుగా ఆలయం వద్ద ప్రసిద్ధి గాంచినట్టు చెబుతారు. ఆలయానికి వచ్చిన భక్తులు మాచేనమ్మని దర్శించుకుని తరువాత ఈ చెట్టుకు కూడా పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

సత్తా చాటిన దివ్యాంగులు

విభిన్న ప్రతిభావంతులకు క్రీడాపోటీలు

భీమవరం అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :విభిన్న ప్రతిభావంతులు ప్రతిభ చాటారు.. ఆటల్లో వారు చూపించిన తెగువ ముందు వైకల్యం కూడా ఓడింది.. వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు..అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలను కలెక్టర్ చదలవాడ కలెక్టర్ ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతులు ఎవరికి తీసిపోరని క్రీడలతో పాటు చదువు చాలా ముఖ్యమని బాగా చదువుకుంటే ఆత్మస్థైర్యం పెరుగుతుందని వారి కాళ్లపై వారు నిలబడే స్థాయికి చేరుకుంటారని తెలిపారు. పలు అసోసియేషన్స్ అధ్యక్షుల విజ్ఞాపనల మేరకు మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్ పుట్,పరుగు పందెం, షాట్ పుట్, క్రికెట్ వంటి క్రీడలను నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, ఎస్ఎస్ఏ పీవో శ్యాంసుందర్, చెరుకువాడ రంగసాయి, డీఎన్ఆర్ కళాశాల ప్రెసిడెంట్ జి.నరసింహరాజు, సెక్రటరీ గాదిరాజుబాబు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి



కబడ్డీ..కబడ్డీ..



గురి చూసి విసిరారంటే..



రన్.. రన్.. పరుగుల రాణులు..



త్రో చేస్తే.. విజయం మాదే..





బాల్ వేస్తే ..బౌండరీ దాటిస్తా





జ్ఞానాన్ని పంచడమే గీతా సారం

నేడు గీతా జయంతి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురాణాల ప్రకారం మార్గశిర మాసంలోని శుక్లపక్ష ఏకాదశి నాడు గీతా జయంతిని జరుపుకుంటాం. చంద్రమాన క్యాలెండర్ ప్రకారం ఈనెల 11వ తేదీన గీతా జయంతి. హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత ఆవిర్భవించిన రోజుగా చెబుతారు. కురుక్షేత్ర సమరంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఈరోజు గీత సందేశాన్ని ఇచ్చినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది.11వ తేదీ తెల్లవారు జామున 3.42 గంటల నుంచి ప్రారంభమై 12వ తేదీ ఉదయం 1.09 గంటల వరకు ఏకాదశి తిథి ఉంటుంది. ఈ తిథి ప్రకారమే గీతా జయంతిని జరుపు కుంటాం. ఈరోజున భగవద్గీత పఠించడం అత్యంత పుణ్యకార్యంగా పండితులు చెబుతున్నారు. కృష్ణ భగవానుని పూజించాలి.. పేదలకు ఆహారం, దుస్తులు దానం చేయాలి.ఈరోజున ఓం నమో భగవతే వాసుదేవాయ అనే మంత్రాన్ని జపించడం ద్వారా శ్రీకృష్ణుని అనుగ్రహం సొంతమవుతుంది. తులసి మొక్క విష్ణువుకు అత్యంత ప్రీతికరమైనది. ఈరోజున తులసి మొక్కను పూజించి తులసీ దళాలను దేవునికి సమర్పించాలి. ఈరోజున ప్రతీఒక్కరూ గీతా జ్ఞానాన్ని ఇతరులకు తెలియచేసేందుకు ప్రయత్నించినా భగవంతుని అనుగ్రహం కలుగుతుందని పురాణాల్లో చెప్పబడు తుంది. గీతా జయంతి రోజున మోక్షద ఏకాదశి అని కూడా అంటారు. ఏలూరు నగరానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు దివంగత పోలిశెట్టి గోవిందరావు 1958లో అగ్రహారంలో దాదాపు వెయ్యి గజాల స్థలంలో గీతా మందిరాన్ని నిర్మించి ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడే ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్యంతో ఆటలా ?



ఆయుర్వేదంలో అవకతవకలు

నాణ్యత లేని, కాలం చెల్లిన మందుల అమ్మకాలు

లైసెన్స్‌లు లేకుండానే నిర్వహణ

అధికారుల పర్యవేక్షణ కరువు

భీమవరం క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేదం ఒక ఔషధం, పూర్వకాలంలో ప్రజలకు ఎటువంటి రోగాలు వచ్చినా ఆకుపసర్లు, వేర్లు, ఆయుర్వేద మందులతోనే తగ్గించేవారు. హోమియో మందులు కూడా అప్పట్లో ప్రాచుర్యం పొందింది. ఇంగ్లిష్ మందులు రావడంతో ఆయుర్వేద మందుల వాడకం తగ్గిపోయింది. అయితే ఆయుర్వేద మందులు ఇటీవల కాలంలో కల్తీలకు గురవుతున్నాయి. నాణ్యత లేకుండా కాలం చెల్లిన మందులను కొందరు దుకాణదారులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అడిగితే ఆయుర్వేదం మందులకు ఎక్స్‌పైరీ డేట్ ఉండదని చెప్పి ప్రజల వద్ద సొమ్ము కొల్లగొడుతున్నారు. కొన్ని ఆయుర్వేద, హోమియో దుకాణాలు వారు లైసెన్స్ లేకుండా విక్రయాలు చేయడం గమనార్హం. అంతేకాకుండా షాపు యజమానులు, దుకాణాల్లో పనిచేసేవారే డాక్టర్లుగా చెలామణి అవుతూ రోగులు రోగం చెప్పగానే ఏదో ఒక మందు ఇచ్చే స్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఇలాంటి వాటిని గుర్తించి నియంత్రించాల్సిన 'ఆయుష్' పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



భీమవరంలో ఆయుర్వేద, హోమియో ఆస్పత్రులు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఆరు ఆయుర్వేద ప్రైవేట్ దుకాణాలు ఉన్నాయి. అలాగే 12 మంది ప్రైవేట్ వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే భీమవరం, పాలకొల్లు, జున్నూరు, వెంపలో వైద్యులు ఉన్నారు. ఆకివీడులో యూనాని వైద్యుడు, కాళ్లలో హోమియో వైద్యుడు ఉన్నారు. ఇవి ప్రభుత్వ లెక్కల్లో మాత్రమే..కానీ అనధికారికంగా ఎటువంటి లైసెన్స్ లేకుండా కొన్ని ఆయుర్వేద మందుల షాపులు నడుస్తున్నాయి. కొందరు హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉంటూ దుకాణాలు ఏర్పాటు చేసి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా మందులు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు ఏదో ఒక మందు వాడి అనారోగ్యం పాలై ఒళ్ళు గుల్ల చేసుకుంటున్నారు. అలాగే 140 మంది హోమియో వైద్యులు, 80 హోమియో ప్రైవేట్ దుకాణాలు కూడా జిల్లాలో ఉన్నాయి.

ఏడాదికోసారి రెన్యువల్ చెయ్యాలి

ఆయుర్వేదం, హోమియో దుకాణాల యజమానులు ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. కొందరు దుకాణదారులు ముందుగా లైసెన్స్ పొందినప్పటికీ తరువాత రెన్యువల్ చేయకుండానే విక్రయాలు చేస్తున్నా అధికారులు అటువైపు అయినా కన్నెత్తి చూడకపోవడం విశేషం. కొందరు దుకాణదారులు మాత్రం లైసెన్స్ రెన్యువల్ కోసం వెళ్తే ఒకరోజు సమయంతోపాటుగా కొందరు అధికారులకు చేతులు తడపాల్సి వస్తుందన్న భావనతో ముందుకు వెళ్ళడం లేదు.

రాష్ట్రంలో ఒక్కరే డ్రగ్ ఇన్‌స్పెక్టర్

రాష్ట్రం మొత్తం మీద ఒక్కరే ఆయుర్వేదం దుకాణాలకు సంబంధించి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉండటంతో దుకాణదారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. దుకాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో కాలం చెల్లిన, నాసిరకం మందులు విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లైసెన్స్ ఉందా లేదా ? ఏయే రకాల మందులు విక్రయిస్తున్నారు ? ఆయా కంపెనీలకు అనుమతులు ఉన్నాయా? వైద్యుల పర్యవేక్షణలో మందులు విక్రయిస్తున్నారా లేదా అని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది.

కొత్తగా ఎన్‌సీఐఎస్ఎం వ్యవస్థ

నూతనంగా వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం ఎన్‌సీఐఎస్ఎం (నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ మెడిషన్) అనే వ్యవస్థను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుత రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆధ్వర్యంలో ఈ సిస్టమ్ ద్వారా పూర్తిస్థాయిలో దుకాణాలపై నిఘా ఉంచనున్నారు. అలాగే ప్రతి జిల్లాకు కూడా 'ఆయుష్' ద్వారా క్లినిక్‌లను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి వైద్యం అందించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఆయుర్వేద మందుల దుకాణాలు యజమానులు తమ లైసెన్స్ రెన్యువల్స్‌ను 3 లేదా 5 సంవత్సరాలకు పెంచాలని కోరనున్నట్లు సమాచారం.



పచ్చా పచ్చని చెట్టు

ఆ దారిలో వెళుతున్న వారిని ఆ చెట్టు తనవైపు చూసేలా చేస్తోంది.. చెట్టంతా పసుపు రంగును పూసుకుని చూపరులను కట్టిపడేస్తున్నది. పక్కన ఉన్న చెట్లన్నీ పచ్చదనంతో దర్శనమిస్తుండగా ఈ చెట్టు మాత్రం పసుపురంగుతో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పందిరి మామిడిగూడెం కొండరెడ్డి గ్రామంలో రోడ్డుపక్కనే ఉన్న నిద్రమామిడి ఆకులన్నీ పసుపు రంగులోకి మారి కనువిందు చేస్తున్నాయి. ఇదే జాతికి చెందిన మరో చెట్టు పచ్చదనంతో ఉండటం విశేషం.

-బుట్టాయగూడెం



ఈ చిట్టి బొప్పాయి.. గట్టిదే..

ఈ చిట్టి బొప్పాయి చెట్టు చూసేందుకు చిన్నదిగా ఉన్నా.. గట్టిదే. దాదాపు మూడున్నర అడుగుల ఎత్తులో ఉన్న ఈ చెట్టు కాయలతో కళకళలాడుతోంది. ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో ఉన్న ఇది భూమికి అరడుగు ఎత్తునుంచే కాయలు కాస్తూ చూపరులను అబ్బురపరుస్తోంది. చెట్టు నిండా దాదాపు 30 పైబడి పెద్దపెద్ద కాయలతో చూపరుల దృష్టిని ఆకర్షిస్తోంది.

-ద్వారకాతిరుమల

ఆలోచింపచేసిన నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత ?

(వీరవాసరం) భీమవరం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం తోలేరులో జరుగుతున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింప చేసేవిధంగా ఉన్నాయి. నేటి సమాజంలో జరగుతున్న అసమానతలు, పడిపోతున్న విలువలు, కటుంబ కలహాలు ఇలా ప్రతీ అంశాన్ని కళ్ళకు కట్టినట్లుగా కళాకారులు చేస్తున్న ప్రదర్శన ఆకట్టుకుంటున్నాయి. నిశ్శబ్దమా..నీ ఖరీదెంత ? అనే నాటకం నేటి సమాజంలో జరుగుతున్న సంఘటలను యధాతథంగా చూపించారు. కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు కారణంగా నిజంగా కష్టాలు అనుభవిస్తున్నావారికి న్యాయం జరుగుతోందో తెలియదుకానీ కొందరి తప్పుడు రిపోర్టులతో చట్టం ఏవిధంగా దుర్వినియోగం అవుతున్నాయో చూపించారు. చట్టంలో వచ్చిన మార్పు వల్ల కుటుంబ వ్యవస్థ ఎలా ఇబ్బందులు పడుతోందో చూపించారు. విశాఖపట్నంకు చెందిన తెలుగు తల్లి కళాసమితి ఈ నాటిక ప్రదర్శించారు. మాధవ్ కథను రచించగా చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వం వహించారు. తరువాత సద్గురు కళానియమం గుంటూరు వారిచే కమనీయం నాటకం కూడా ఆకట్టుకుంది. కళారూపాలు ప్రదర్శించే చోటికి ప్రేక్షకుడు వచ్చేలా చేయడం, సంఘటితమై సమ సమాజం ఆవిష్కరణల వైపు అడుగు వేయించడమే కమనీయం నాటకమని చూపించారు. మునిపల్లి విద్యాధర్ రచించిన ఈ నాటకానికి బసవరాజు జయశంకర్ దర్శకత్వం వహించారు.



నిశ్శబ్దమా..నీ ఖరీదెంత.. నాటికలో సన్నివేశం

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శబరిమలై యాత్రికులను దృష్టిలో పెట్టుకుని విజయవాడ డివిజన్ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్ళను నడపనున్నారు. రైల్ నెంబర్ 07173 కాకినాడ పోర్టు - కొల్లాం బుధవారం రాత్రి 23.50 నిముషాలకు కాకినాడ పోర్టులో బయలుదేరనుంది. ఈనెల 11,18, 25 తేదీలలో నడపనున్నారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కొల్లాం చేరుకోనుంది. రైల్ నెంబర్ 07174 కొల్లాం - కాకినాడ పోర్టు శుక్రవారం రాత్రి 8.40 నిము షాలకు కొల్లాంలో బయలుదేరి శనివారం సాయంత్రం 4 గంటలకు కాకినాడ పోర్టుకు చేరుకోనుంది. ఈ రైలును ఈనెల 13, 20, 27 తేదీలలో నడపనున్నారు. కాకినాడ టౌన్, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి తదితర స్టేషన్లలో ఆగనున్నాయి.

రైళ్ల దారి మళ్ళింపు :

విజయవాడ దక్షిణమధ్య రైల్వే పరిధిలోని గన్నవరం - ముస్తాబాద్, చేబ్రోలు - బాదంపూడి స్టేషన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్‌ల నిర్వహణ నేపథ్యంలో రైళ్ళను దారి మళ్ళిస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైళ్ళు తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా కాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్ళించనున్నట్లు తెలిపారు.

రైల్ నెంబర్ (12863) హౌరా- బెంగళూరు ఈనెల 11, 13, 14, 16, 17, 20, 21, 23, 24 తేదీలలో , (13351) ధన్‌బాగ్ - ఆల్పుజా 10, 16, 17, 20, 21,23, 24 తేదీలలో, (22837) హట్యాయ్ - ఎర్నాకుళం 16, 23 తేదీలలో , (12835) హట్యాయ్ -యర్నాకుళం 10, 17, 24 తేదీలలో , (12889) టాటానగర్ - బెంగళూరు ఈనెల 20వ తేదీ, (18637) హట్యాయ్ - బెంగళూరు ఈనెల 21వ తేదీ (11019) ముంబై - భువనేశ్వర్ ఈనెల 11, 13, 14, 25, 27, 28, 30 తేదీలలో, (17239) గుంటూరు- విశాఖపట్టణం ఈనెల 26, 29,31 తేదీలలో దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు.

డిజిటల్ పల్లెలు



పంచాయతీల్లో సేవలన్నీ ఇక ఆన్‌లైన్

జనవరి నుంచి డిజిటైలేజేషన్

పారదర్శకంగా ప్రభుత్వ సేవలు

కార్యదర్శులకు డిజిటల్ 'కీ'

వేగంగా సర్టిఫికెట్ల జారీ



ఏలూరు రూరల్/ అత్తిలి డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు పంచాయతీల్లో ఏ సేవ కావాలన్నా మాన్యువల్‌గా దరఖాస్తు చేయాల్సిందే. ఈ విధానానికి కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలని నిర్ణయించింది. డిజిటైలేజేషన్ దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీల్లో ఇకపై డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు వేగంగా పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందనున్నాయి. కొత్త సంవత్సరం జనవరి నుంచి ఈ సేవలు అమలులోకి వస్తాయి. వీటికి సంబంధించి కార్యదర్శులకు డిజిటల్ 'కీ' అందుబాటులోకి రానున్నది. ఏలూరు జిల్లాలో 489 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి కార్యదర్శికి సంబంధించిన సమగ్ర వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తు న్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 393 పంచాయతీలు ఉన్నాయి. 20 మండలాలున్నాయి. అన్ని పంచాయతీల్లో ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. పంచాయతీలు జారీ చేసే వివిధ ధ్రువీకరణ పత్రాలకు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా సులువుగా సర్టిఫికెట్లు పొందేలా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

కొత్త విధానం ఇలా

మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుంటే వాటిని కార్యదర్శులు పరిశీలించి డిజిటల్ సంతకాలు చేస్తారు. అనంతరం మీసేవ నుంచి సర్టిఫికెట్లు తీసుకునేలా చర్యలు చేపట్టారు. పంచాయతీల ద్వారా ఏదైనా ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే నమోదు చేసి ఫోన్ నెంబర్లు, దరఖాస్తు సంఖ్య మేసేజ్ రూపంలో వస్తుంది. పత్రం సిద్ధం కాగానే మళ్లీ మెసేజ్ రూపంలో సమాచారం అందు తుంది. పంచాయతీలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు మూడు రోజుల వ్యవధిలో సర్టిఫికెట్లు పొందవచ్చు.

ఎక్కడ నుంచైనా చెల్లింపులు

ఎక్కడ ఏ మూలన ఉన్నా మీ సొంత గ్రామాల్లో ఇంటి, ఆస్తి పన్ను చెల్లించాలంటే పంచాయతీ వరకు వెళ్లనవసరం లేదు. ఉన్న చోట నుంచే ఆన్‌లైన్‌లో ఆస్తి పన్ను చెల్లించవచ్చు. స్వర్ణ పంచాయతీల్లో భాగంగా డిజిటల్ సేవలు అందు బాటులోకి రానున్నాయి. ఈ మేరకు పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సెల్ (పీవోఎస్) పరికరాలను సిద్ధం చేస్తున్నారు. వీటితో డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బకాయిలు చెల్లించవచ్చు. వసూలు చేసిన మొత్తాలను పంచాయతీల పీడీ ఖాతాలకు జమ చేస్తారు. పంచాయతీల్లో తొలి దశలో ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు, వ్యాపార లైసెన్స్‌లు, జనన, మరణ, వివాహ, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి సుమారు 80 సేవలను పంచాయతీ పోర్టల్లో అందుబాటులో పెట్టనున్నారు. గత ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం వహించింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం డిజిటల్ పంచాయతీలను అభివృద్ధి చేసింది. వైసీపీ వచ్చాక ఎస్ఐపీ నిధులు ఇవ్వకపోవడంతో పోర్టల్ నిర్వహణ మూలన పడింది. కూటమి ప్రభుత్వం రావడంతో స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వహణను రాష్ట్ర ఆర్థిక నిర్వహణ సేవల సంస్థకు అప్పగిస్తుంది. దీంతో పంచాయతీల్లో దరఖాస్తు చేస్తే చాలు 80 రకాల సేవలు అందు బాటులోకి వస్తాయి.





పురుషుల విజేత తూర్పుగోదావరి... మహిళల్లో ప్రథమస్థానం సాధించిన విశాఖ జట్టు

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

పురుషుల విజేత తూర్పుగోదావరి జట్టు

మహిళల విన్నర్‌గా విశాఖపట్నం

పెనుమంట్ర, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో శారీరక ధృడత్వమే కాకుండా మానసిక ఆరోగ్యం పొందవచ్చని జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మార్టేరులో మంగళవారం రాత్రి జరిగిన ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగాయి. మంత్రి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. క్రీడాకారులు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏషియన్ గేమ్స్ నిర్వహించారన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహకాలు పెంచామన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మార్టేరులో మల్టిపుల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ప్రభుత్వం ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని క్రీడాకారులు కోరారు. జడ్పీచైర్మన్ గంటా పద్మశ్రీ, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా విన్నర్‌గా, అనంతపురం జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచాయి. చిత్తూరు జిల్లా మూడో స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో విశాఖపట్నం విన్నర్‌గా, పశ్చిమగోదావరి జిల్లా రన్నర్‌గా గెలుపొందారు. తూర్పు గోదావరి జిల్లా మూడో స్థానంలో విజయం సాధించాయి. మంత్రి నిమ్మల వీరికి బహు మతులు ప్రదానం చేశారు.

మావుళ్ళమ్మ ఉత్సవాలకు నేడు శ్రీకారం

నేటి నుంచి 25 వరకు

నిజ రూప దర్శనం నిలిపివేత



భీమవరం టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జనవరి 13 నుంచి భీమ వరం మావుళ్లమ్మ వార్షిక మహోత్సవాల సందర్భంగా ఉత్సవ పందిళ్ళు వేసేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు పందిరి రాటను నిలబెట్టనున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లును చేస్తోంది. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ఆధ్వ ర్యంలో పూజలు నిర్వహించి పందిరి రాటను నిలబెటనున్నారు. కమిటీ సభ్యులతోపాటు ఆలయ అధికారులు పాల్గొంటారు. మావుళ్ళమ్మ వార్షిక మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం బుధవారం నుంచి అమ్మ వారి మూల విరాట్ దర్శనం నిలిపివేయ నున్నారు. ఉదయం 11 గంటలకు పూజలు నిర్వహించిన తరువాత అమ్మవారి ఆలయ తలుపులను మూసివేస్తారు. బాలాలయంలో అమ్మవారి కళశానికి, ఉత్సవ మూర్తికి ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ నిత్య పూజలు, హారతులను అందిస్తారు. భక్తులు అక్కడే దర్శనం చేసుకోవలసి ఉంటుంది. తిరిగి 25వ తేదీన ప్రత్యేక పూజలు చేసిన అనం తరం అమ్మవారి మూలవిరాట్ దర్శనం కల్పిస్తారని ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు.



ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్‌పర్సన్ గండి బాబ్జి

ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణను జరగనివ్వం

పెదవేగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణను జరగనివ్వబోమని ఆంధ్రప్రదేశ్ నూనెగింజల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్‌పర్సన్ గండి బాబ్జి రైతులకు హామీఇచ్చారు. గండి బాబ్జి పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ ప్రాసెసింగ్ యూనిట్(పామాయిల్ ఫ్యాక్టరీ)ను మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఫ్యాక్టరీలో కలియతిరిగి, జరుగుతున్న ప్రాసెసింగ్‌ను ఆయన పరిశీలించారు. పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగులో ఎదురౌతున్న కష్టాలు, ఎరువుల యాజమాన్యం, వ్యయభారం, రాబడిని ఆయన ముందుంచారు. పెట్టుబడికి తగ్గ ఆదాయం రావడంలేదని, అదే పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రైతులకు ఆశించిన రాబడి వస్తుందని, ఆ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా అందించే ఏర్పాటు చేయాలని విన్నవించారు.



కేంద్ర బృందం లేసు పార్కు పరిశీలన

నరసాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం లేసు పార్కును మంగళవారం సెంట్రల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. పశ్చిమ జిల్లాను వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్‌లో భాగంగా క్రోచెట్ లేసును నేషనల్ లెవెల్‌లో సెలెక్ట్ చేయడం జరిగింది. దానిలో భాగంగా భారతదేశంలో 450 ప్రొడక్ట్స్‌ను ఆన్‌లైన్‌లో దేశ వ్యాప్తంగా వివిధ ప్రొడక్ట్స్ పంపించడం జరిగింది. వాటిలో నుంచి 40 ప్రొడక్ట్స్‌ను సెంట్రల్ టీమ్ సభ్యులు ఎంపిక చేయడం జరిగింది. కమిటీ సభ్యులు పరిశీలించి ప్రొడక్ట్స్‌లో ఒక దాన్ని బెస్ట్‌గా సెలెక్ట్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హెచ్‌డీసీ వీసీ అండ్ ఎండీ ఎం విశ్వ, కేంద్ర బృందం సభ్యులు జాస్మన్‌కౌర్, నచ్చికత మిట్టల్, డీఆర్‌డీఏ పీడీ ఎం వేణుగోపాల్, కె.అప్పారావు, రవీంద్రగౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

లేస్‌కు వన్నె తెచ్చే విధంగా చర్యలు: కలెక్టర్

భీమవరం టౌన్: లేస్‌కు మరింత వన్నె తెచ్చేదిశగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని న్యూఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆధ్వర్యంలో కలుసుకుని లేస్ ఉత్పత్తులపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లేస్ అల్లికలలో నూతన డిజైన్లను తయారు చేయడానికి అల్లికదారులకు సూచించడం జరిగిందని, లేసు అల్లికలను మరింత ఆకర్షణీయంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరిగింద న్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

రైతుల పరిస్థితి దయనీయం: ఎమ్మెల్సీ బొత్స

ఇరగవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉందని వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల వైసీపీసమీక్షా సమావేశం తణుకు పట్టణంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, విద్యుత్ బిల్లుల పెంపుపై పోరాటం చేయాలని మాజీ ముఖ్య మంత్రి జగన్ పిలుపునివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈనెల 13న రైతు సమస్యలపై కలెక్టర్లకు వినతిపత్రం అందజేయడం, ఈనెల 27న విద్యుత్ బిల్లుల పెంపుపై ఉద్యమం, జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఉద్యమించడం జరుగుతుందన్నారు. అకాల వర్షాలతో తడిచిన ధాన్యాన్ని రైతులు ఎంతో కొంతకు అమ్ముకోవాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్, మాజీ మంత్రులు తానేటి వనిత, కొట్టు సత్యనారాయణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు చీర్ల జగ్గిరెడ్డి, తలారి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల నుంచి ప్రాణ హాని

కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటాం.. సత్తెమ్మ దేవాలయ పిటీషన్‌దారుడు స్పష్టం

నరసాపురం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురం సౌత్‌లో సత్తెమ్మ దేవాలయం వివాదం రోజుకో మలుపు తిరుగుతున్నది. సుమారు 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని తొలగించాలంటూ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చెరుకూరి ప్రసాదరాజు కోర్టులో పిటిషన్ వేసిన విషయం విదితమే. దీనిపై సోమవారం గ్రామస్థులు ఫైర్ అయ్యారు. వైసీపీ నాయకుడు పిటీషన్ ఉపసంహరించుకోవాలని అల్టిమేట్ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో ప్రసాదరాజు ఆయన కుటుంబ స భ్యులు మీడియా ముందుకొచ్చారు. మంగళ వారం రాత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఈ వివాదాన్ని గ్రామానికి చెందిన ఆరుగురు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నారన్నారు. అల యం నుంచి వచ్చే శబ్ధాల వల్ల తన కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారని, ఇదే విషయాన్ని గ్రామ పెద్దలకు తెలియజేయడం జరిగిందన్నారు. ఇదిగో అదిగో అంటూ కాలయపన చేసి ఇప్పుడు మా కుటుంబ సభ్యులపై ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని జరిగితే ఆ ఆరుగురే బాధ్యత వహించాలన్నారు. ఈ విషయంలో కోర్టు నిర్ణయానికే తమ కుటుంబం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం

మునునూరు, డిసె ంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మునునూరు గ్రామంలో దేవర చెరువు సమీపంలో మంగళవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం కనిపించడ ంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి చుట్టుపక్కల పరిసరాలు, మృతదేహన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటాయని, అతని వద్ద ఊరు, పేరుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి ఎత్తు 5 అడుగులు, ఆరెంజ్ రంగు టీషర్ట్ మాత్రమే ధరించి ఉన్నాడు. రెండు రోజుల క్రితం మృతుడు మండలంలోని వలసపల్లి గ్రామంలో మతిస్థిమితం లేకుండా అటు, ఇటు తిరిగినట్లు స్థానికులు చెబుతు న్నారు. వృద్ధుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు 94407 96441 నెంబరును సంప్రదించాలని ఏఎస్సై తెలిపారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

GOLD FINANCE
బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368
AJB -225408

పాఠకులకు ముఖ్య గమనిక
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

సీపీఎస్ రద్దు కోసం సైకిల్ యాత్ర చేపట్టినా, శ్రీకాకుళం నుంచి అమరావతి వరకు బస్సుయాత్ర నిర్వహించినా ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగకుండా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడు గోపిమూర్తి. ఈనెల 5వ తేదీన జరిగిన తూర్పు పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో యూటీఎఫ్ బలపరిచిన బొర్రా గోపిమూర్తి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చరిత్ర లోనే అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచాడు. సోమవారం నాడు కాకినాడ లో నిర్వహించిన కౌంటింగ్‌లో తన సమీప ప్రత్యర్థి గంధం నారాయణ రావుకు 5259 ఓట్లు రాగా, గోపిమూర్తికి 9165 మొదటి ప్రాధాన్యత ఓట్లు తో గెలుపొందారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బొర్రా గోపిమూర్తితో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

- నిడమర్రు

నా బాధ్యత పెరిగింది

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా ...

'ఆంధ్రజ్యోతి'తో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపిమూర్తి



ఇంటర్వ్యూ..

ప్రశ్న: మీ ఉపాధ్యాయ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది ?

1998 ఆగస్టు 19న ఆచంట మండలం భోగలాపురంలో సెకండ్ గ్రేడు ఉపాధ్యాయుడుగా జీవితం ప్రారంభమైంది.

ప్ర: యూటీఎఫ్‌లో ఎలాంటి పాత్ర పోషించారు ?

నా ఉద్యోగ జీవితంతో పాటు ఉపాధ్యాయ ఉద్యమాల పట్ల ఎక్కువగా ఆకర్షితునయ్యాను. యూటీఎఫ్ కార్యకర్తగా పనిచేయడం నాకు ఎనలేని గుర్తింపునిచ్చింది. ఉపాధ్యాయ సమస్యల కోసం సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నాశక్తి మేరకు పనిచేశాను. ముఖ్యంగా మా నాయకుడు మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ షేక్ సాబ్జితో పని చేసిన పోరాటాలు, ఉద్యమాలు నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఉద్యోగం జీవింతంలో నేను పాల్గొన్న అసెంబ్లీ ముట్టడి, సి.ఎం క్యాంపుఆఫీసు ముట్టడి, విజయవాడ ధర్నా వంటి ఉద్యమాలను, పోరాటాలను గుర్తుంచుకొని యూటీఎఫ్, మిత్ర సంఘాల నాయకులు, కార్యకర్తలు నా విజయం కోసం పగలు, రాత్రి ఎంతో కష్టపడ్డారు.

ప్ర: ఎమ్మెల్సీగా ఎన్నికైన మీ లక్ష్యం ఏమిటీ ?

ఉపాధ్యాయ సంఘ నేతగా కన్నా ఇప్పుడు ఎమ్మెల్సీగా నా బాధ్యత మరింత పెరిగింది. శాసనమండలి సమావేశాలలో, రాష్ట్ర సచివాలయ సమావేశాలలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పనిచేస్తా. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అప్రంటీస్ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు, సీఆర్పీల సమస్యల కోసం కృషి చేస్తాను.

ప్ర: ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కోసం ఏం చేస్తారు. ?

ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల భారం, ఎండీఎం నిర్వహణ భారం, నిత్యం ఆన్‌లైన్ వర్క్‌లతో బోధన సన్నగిల్లుతోంది. ప్రభుత్వ విద్యావ్యవస్థ బలపడాలంటే అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. ఉపాధ్యాయులను బోధనకు ఉపయోగించి మిగిలిన పనుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రతి పాఠశాలకు రికార్డు అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఆయా వంటి ఉద్యోగులను నియమించడం ద్వారా ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో బోధనకు దృష్టి పెట్టడం జరుగుతుంది. తద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయి.

ప్ర: ఉపాధ్యాయులకు మీరిచ్చే సందేశం ?

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం నిరంతరం పనిచేయడమే లక్ష్యం. మీ సమస్యలను మా దృష్టికి తీసుకొని వచ్చిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తాను. నాకు మద్దతునిచ్చిన ప్రతి ఒక్క సంఘానికి, నాయకులకు, కార్యకర్తలకు, నాకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మా యూటీఎఫ్ ఉద్యమ నేత స్వర్గీయ షేక్ సాబ్జి అడుగుజాడలలో నడుస్తూ అందరికీ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

మొగల్తూరు సొసైటీలో రుణాల అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.వెంకటేశ్వరరావు

మొగల్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 51 విచారణ కొనసాగుతోంది. 2023లో నాటి సంఘ ఆడిట్ అధికారి నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇచ్చారని, కొంత మంది రైతులకు వడ్డీని తగ్గించి వసూలు చేశారని సుమారు 80లక్షలు నిధుల మళ్ళింపు జరిగినట్టు గుర్తించి 51వ విచారణకు ఆదేశించారు. విచారణ సమయంలో నాటి వైసీపీ ప్రభుత్వంలో నాటి సహకార మంత్రి నుంచి స్టే రావడంతో విచారణ జరుగుతండగా నిలుపుదల చేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పడవల సూర్యనారాయణ అనే రైతు ఈసొసైటీపై 51వ విచారణ కొనసాగించాలని ప్రభుత్వానికి విన్నవించడంతో వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన స్టేని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకుంది. దీంతో గత రెండు నెలలుగా సొసైటీపై విచారణ కొనసాగుతోంది. ఈ విచారణను నరసాపురం సబ్ డివిజన్ కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ జె.వెంకటేశ్వరావు నిర్వహిస్తున్నారు. మంగళవారం మొగల్తూరు సహకార సంఘంలో విచారణకు వచ్చిన ఆయన తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 1800 మంది సంఘ సభ్యులకు నోటీసులు జారీచేసి విచారణ చేస్తున్నామన్నారు. సంఘ సభ్యుల విచారణ అనంతరం సంఘ నాటి పాలకవర్గ డైరెక్టర్‌లను కూడా విచారిస్తామన్నారు. ఈవిచారణలో ఉన్న రికార్డులు ప్రకారం కుటుంబ రుణాలు రూ.10లక్షల 35వేలు, దస్తావేజులు లేకుండా టెన్ వన్ అడంగళ్ ద్వారా 10లక్షల 11వేలు రుణాలు ఇచ్చినట్టుగా గుర్తించామన్నారు. ఆన్‌లైన్‌లో భూమి రికార్డు లేకుండా రూ.14లక్షల 32వేలు, ఫిష్ ఫీడ్‌కు మంజూరు చేసిన రూ. కోటి 32 లక్షల 40 వేల 795 రుణాలకు సంబందించి సరైన ఆధారాలు లేవని గుర్తించడం జరిగిందన్నారు. సంఘ సొంత నిధులు నుండి రూ.31 లక్ష 96 వేల 825 వేలు నిబందనలకు అతీతంగా రుణాలు పొందారని సంఘ సభ్యుల నుంచి వసూలు చేయాల్సిన మొత్తం కంటే కొంత మంది వద్ద తక్కువ వసూలు చేసినట్టుగా విచారణలో తేలిందని ఈనివేదినకు త్వరలో ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

ఎస్సీ జాతీయ కమిషన్ దృష్టికి లెక్కల టీచర్ వ్యవహారం

ఎస్పీకి నోటీసు జారీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులను కొట్టి, కులం పేరుతో దూషించారన్న అభియోగంపై లెక్కల టీచర్ ఎంఎస్‌వీ ముత్యాలరావు వ్యవహారం షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ (ఎస్‌సీఎస్‌సీ) దృష్టికి వెళ్లింది. ఈక్రమంలో షెడ్యూల్ కులాల జాతీయ కమిషన్ డైరెక్టర్ జి.సునీల్‌కుమార్ జిల్లా ఎస్పీకి మంగళవారం నోటీసు జారీ చేశారు. ఈ నోటీస్ అందిన 20రోజులలోపు సదరు వ్యక్తిపై ఏ విధమైన చర్యలు తీసుకొన్నారో నోటీస్‌లో తెలిపిన ఫార్మెట్ ప్రకారం తెలియజేయాలని కోరింది. ఏ విధమైన రిప్లైను కమిషన్ అందుకోకుంటే సివిల్ కోర్టు పవర్స్‌ను వినియోగించుకుని స్వయంగా లేదా రిప్రజెంటేటివ్‌గా తమ కమిషన్ ఎదుట హాజరయ్యేలా సమన్స్ జారీ చేస్తామని నోటీస్‌లో ఎస్పీకి తెలిపారు. ద్వారకాతిరుమలకు చెందిన గుండే ధర్మరాజు తన కుమారుడు త్రివిక్రమ్‌ను, గుండే మాణిక్యం కుమార్తె సహస్రను సదరు టీచరు దారుణంగా కొట్టడమేకాకుండా కులం పేరుతో దూషించినట్లు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ అధ్యక్షుడు బేతాళ సుదర్శనం ద్వారా షెడ్యూల్‌కులాల జాతీయకమిషన్‌కు ఈనెల 6న ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ముందుగా తాము ఎంఈఓ, ఎస్ఐ, కలెక్టర్‌కు ఈ ఘటనపై ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా దీనిపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి, అతనిపై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేయాలని చట్టపరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కమిషన్‌ను కోరారు.

క్రైమ్ కార్నర్

మహిళ అనుమానాస్పద మృతి

కాళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గృహిణి అనుమానాస్పద మృతిపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ ఎస్. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఎస్‌సి బోస్ కాలనీలో పొరపాటి ఆశాజ్యోతి (22) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోయింది. మృతురాలి తండ్రి గులుగుపల్లి వెంకటరత్నం, ఆయన కుమారులు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని తహసీల్దార్ జి.సుందర్‌సింగ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకిరణ్ పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



పాలకోడేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు గ్రామానికి చెందిన కడలి శేషకుమార్ భీమవరంలో పని చేస్తూ కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. శేషకుమార్ (31) మంగళవారం ఉదయం భీమవరం వైపు నుంచి గొల్లలకోడేరు మీదుగా పాలకోడేరు వెళ్తుండగా బ్రిడ్జి డౌన్‌లో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న పంట బోదెలో పడిపోయాడు. ఇతనిపై తాను నడుపుతున్న బైక్ పడిపోవడంతో అతను మృతి చెందాడు. ఆ రహదారిలో నిత్యం ఎవరో ఒకరు ప్రయాణాలు సాగిస్తూనే ఉంటారు. అటువంటి ప్రధాన రహదారిలో ఇతను పడిపోయిన సమయంలో ఎవరూ చూడకపోవడంతోనే శేషకుమార్ మృతి చెందాడని స్థానికులు వాపోతున్నారు. శేషకుమార్‌కు తల్లి, తమ్ముడు ఉన్నారు. తమ్ముడు రామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలకోడేరు ఎస్ఐ రవివర్మ అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి మృతదేహాన్ని శవపంచనామా నిర్వహించి భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

పాలకొల్లు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం వెలివెల గ్రామానికి చెందిన పెనుమాల రాంబాబు(45) కుటుంబ కలహాలతో సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు అంతర్‌జిల్లా దొంగల అరెస్టు

- 88 లక్షల 73 వేల 500 రూపాయలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- నగదు 63 వేల రూపాయలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారపు ఆభరణాలు, వెండి వస్తువులు

ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు మొత్తం 88 లక్షల 73 వేల 500 రూపాయలు విలువ కలిగిన బంగారు, వెండి వస్తువులు, 63 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కేసుల వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఏలూరు జిల్లాలోని గణపవరం, భీమడోలు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆకివీడు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డ ముఠా కోసం జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, నిడమర్రు సీఐ ఎంవి సుభాష్, ఎస్ఐలు సుధాకర్, మణికుమార్, సూర్యభగవాన్, ఎన్ వీర ప్రసాద్ వారి బృందాలు గాలింపు చేపట్టారు. ఈ నేరాలకు పాల్పడిన ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన కర్రెడ్డి మణికంఠ సాయి శ్రీనివాస్ (23), యార్లపాటి మౌనిసన్ని అలియాస్ సన్ని (23), పెద్దా హేమ కుమార్ అలియాస్ హేమంత్, పెద్దిరెడ్డి రత్న శేఖర్ (20)లను అరెస్టు చేశారు. వీరు తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి వేళ వాటిని పగలుగొట్టి నేరాలకు పాల్పడుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారించి 700 గ్రాముల బంగారపు వస్తువులు, 7 కేజీల వెండి వస్తువులు, 63 వేల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ చెప్పారు.

పని మనిషే నేరస్తురాలు

ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ 13వ రోడ్డులో ఎర్రంశెట్టి సురేష్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లికి అనారోగ్యం కావడంతో సత్రంపాడునకు చెందిన చింతా అనిత వెంకటలక్ష్మి అలియాస్ అనిత (45) అనే ఆమెను పనిమనిషిగా పెట్టుకున్నారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఎంతో నమ్మకంగానే పనిచేస్తుంది. ఆమె గతంలో అనిత వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారం చేసి అప్పులపాలై వడ్డీలు కట్టలేక ఇంటి పనికి చేరింది. ఆ ఇంట్లో పనిచేస్తూ ఆనుపాను కనుగొని బీరువాలో ఉన్న బంగారపు వస్తువులను ఇంటి వాళ్ళు లేని సమయంలో తస్కరించాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రెండు నెలలుగా కప్‌బోర్డులో ఉన్న తాళాలు తీసుకుని బీరువా తెరచి అప్పుడొక వస్తువు అప్పుడొక వస్తువు ఈ విధంగా మొత్తం 302 గ్రాముల బంగారాన్ని అపహరించింది. ఈ సంఘటనపై సురేష్ త్రి టౌన్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితురాలిని విచారించి మొత్తం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో అనితను మంగళవారం ఉదయం అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ 18 లక్షల 73 వేల 500 రూపాయలు ఉంటుందని వెల్లడించారు.

అధికారులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు

అంతర్‌జిల్లా దొంగలను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందికి, ఇంట్లో పనిచేస్తూ ఆ ఇంట్లోని బంగారాన్ని అపహరించిన మహిళను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ కిశోర్ నగదు రివార్డులను, ప్రశంసా పత్రాలను అందించారు. అందుకున్న వారిలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, నిడమర్రు సీఐ ఎన్‌వి సుభాష్, త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, భీమడోలు ఎస్ఐ సుధాకర్, గణపవరం ఎస్ఐ మణికుమార్, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, నిడమర్రు ఎస్ఐ వీరబాబు, ఏలూరు త్రి టౌన్ ఎస్ఐ పి రాంబాబు, పలువురు హెడ్ కానిస్టేబుళ్ళు ఉన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు

- పది మంది అరెస్టు
- మరొకరి కోసం గాలింపు
- 19 గంజాయి లిక్విడ్ బాటిళ్ళు స్వాధీనం



నిందితులను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీవేద

మొగల్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలంలో గంజాయి ముఠా గుట్టు రట్టు అయ్యింది. మంగళవారం లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మంది యువకులు అరెస్ట్ కాగా మరొకరి కోసం గాలిస్తున్నట్టు నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టి ఈ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో పది మంది యువకులు అనుమానాస్పదంగా ఉన్నారనే సమాచారంతో సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.వాసు సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామానికి చెం దిన పొన్నమండ కృష్ణప్రసాద్, అదే గ్రామానికి చెందిన రామాని కుసుల్ దుర్గ, మచిలీపట్నంలోని గిలకిలదిండికి చెందిన వల్లభుని గోపాలకృష్ణ, రామాని మనోజ్ కుమార్, మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెం దిన దొంగ ప్రసాద్, నరసాపురం పట్టణానికి చెందిన కొల్లాటి వాసుదేవ్, జోశ్యుల సుబ్రహ్మణ్యం విశ్వేశ్వర, కర్రి ఆదిత్య వినాయక పవన్ కుమార్, మొగల్తూరు గ్రామానికి చెం దిన చదలవాడ కృపావరం, ఇరగవరం మం డలం కాకిలేరుకు చెందిన వీరవల్లి సుధీర్‌అను అరెస్ట్ చేసి 135.198 మిల్లీ గ్రాముల బరువు గల 19 సీసాల లిక్విడ్ గంజాయి, 8 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. గంజాయి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.95వేలు ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అరెస్ట్ అయిన పది మందిలో ఆరుగురిపై పలు స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.

నగర రోడ్లకు మహర్దశ

▸▸ 5.8 కిలోమీటర్ల నూతన రహదారుల నిర్మాణానికి శ్రీకారం

వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లన్నీ ఎంత అధ్వానంగా తయారయ్యాయో ప్రజలకు తెలిసిందే. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసి వెళ్లిపోవడంతో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిధులతో రోడ్లను చేపట్టే పరిస్థితి లేకపోవడంతో పీపీపీ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో జిల్లాలోని అన్ని మున్సిపాల్టిల్లో నూతన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి నగరంలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించింది. రహదారులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఏలూరు నగరపాలక సంస్థలో ఎన్ని కిలోమీటర్ల రోడ్లు అసరమో తెలపాలన్నారు. డీఎం ఏ కమిషనర్‌ను ఆదేశించింది. నగరంలో ఐదు ప్రధాన రోడ్లలో 5.78 కిలోమీటర్ల మేరా నిర్మాణం అవసరం ఉందని డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మి నిస్ట్రేషన్ (డీఎంఏ)కు పంపారు. ఆ వెంటనే 5.78 కిలోమీటర్ల రోడ్లను ప్రభుత్వం మంజూరు చేసిం ది. పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి స్వాతి మెడికల్ స్టోర్స్ నుంచి ఆర్ఆర్ పేట మీదుగా ప్రభుత్వాస్పత్రి వరకు 1.28 కిలోమీటర్లు, విజయవిహార్ సెంటర్ నుంచి అశోక్‌నగర్ ఫ్లైఓవర్ వరకు 1.19 కిలోమీటర్లు, పాండురంగా థియేటర్ నుంచి నుంచి కైకలూరు క్రాస్ రోడ్డు వరకు 1.1 కిలోమీ టర్లు, పెద్ద రైల్వే స్టేషన్ నుంచి తంగెళ్లమూడి బ్రిడ్జ్ వరకు 0.8 కిలోమీటర్లు, జంగారెడ్డిగూడెం రోడ్డు నుంచి బీడీకాలనీ వరకు 1.5 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలోనే వీటికి టెండర్లు పిలిచేందుకు నగర పాలక సంస్థ సమయత్తం అవుతున్నారు. కాంట్రాక్టర్లే ఈ నిర్మాణాలు పీపీపీ పద్ధతిలో చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ విధానంలో కాంట్రాక్టర్లే ముందు పెట్టుబడి పెట్టి ఆ తరువాత ఐదు సంవత్సరాల మేయిటినెన్స్ కూడా వాళ్లే చూసుకునే విధంగా ఉంటుంది. రోడ్ల నిర్మాణానికి ఐదేళ్ల మేయిటినెన్స్ ఖర్చులను నగర పాలక సంస్థ ఐదు విడతలుగా కాంట్రాక్టర్లకు చెల్లిస్తారు. ఈ విధానంలో ముందుకు వచ్చే కాంట్రాక్టర్లకి వీటిని కట్టబెడతారు.

రైల్వే సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీ పుట్టా మహేశ్ కుమార్



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైల్వేలకు సంబంధించిన సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రి అంజని వైష్ణవ్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైల్ భవన్‌లో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసి మహేష్ వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలను కలుపుతూ గుడివాడ జంక్షన్, నూజివీడు, మదిర మీదుగా నూజివీడు విస్సన్నపేటల మధ్య కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలన్నారు. 96 కిలోమీటర్ల ఈ రైలు మార్గం ఏపీ, తెలంగాణల మధ్య ముఖ్యమైన లింకుగా ఉపయోగపడుతుందన్నారు. మచిలీపట్నం పోర్టు, ఇండియా కోల్‌ఫీల్డ్, ఏపీఎస్ ఐడీసీ సెజ్ నుంచి తలెత్తే ట్రాఫిక్ సమస్యను అధిగమించటం కోసం ఈ రైల్వే లైన్ దోహదం చేస్తుందన్నారు. నూజివీడు రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు స్టేషన్‌లో ఈస్ట్ కోస్ట్ రైలు నిలిపేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. సత్తుపల్లి మీద భద్రాచలం, కొవ్వూరు బ్రాడ్ గేజ్ మార్గం మంజూరు చేయాలన్నారు. ఈ లైన్ వలన హైదరాబాదు, విశాఖపట్నం మధ్య 150 కిలోమీటర్లు దూరం తగ్గుతుందన్నారు. కైకలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం రాయగడ, తిరుపతి, కాకినాడ పాసింజర్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను చేబ్రోలులో హాల్ట్ ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు రైల్వేస్టేషన్‌లో గౌతమి, గోదావరి. విశాఖ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను హాల్ట్ ఏర్పాటు చేయాలని కోరారు.

చంద్రబాబుని కలిసిన ఎమ్మెల్యే బడేటి చంటి



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అమరావతి సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిశారు. నియోజకవర్గ సమస్యలపై ఇరువురు చర్చించారు. సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా నియోజకవర్గంలో పలువురు పేదలు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసి ప్రభుత్వ సహకారం కోసం ఎదురు చూస్తున్నారని వారికి త్వరగా విడుదల చేయాలని ముఖ్యమంత్రికి తెలిపారు.

రైతన్నలకు అండగా ఉంటాం... చంటి

రైతులను అన్ని విధాల ఆదు కుంటామని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం బడేటి క్యాంపు కార్యాలయంలో వెంకటాపురంనకు చెందిన రైతులు తమ సమస్యలను చంటి దృష్టికి తీసుకొచ్చారు. పంట చేతికి వచ్చే దశలో వరి పోలాలకు కాల్వల నుంచి నీరు అందటంలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన చంటి పంటలకు నీరందించేందుకు ఇంజన్ ఏర్పాటు చేసుకోవడానికి ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి ఆర్థిక సాయం చేశారు. రైతులు ఎమ్మెల్యే చంటి తీరుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, వీరబాబు, ఎన్.గంగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఏలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ను ంచి సదస్సులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూ రు రూరల్ మండలంలో 11న జాలిపూడి, 12న కోమటిలంక, 13న మల్కాపురం, 16న మాదేపల్లి, 15న శ్రీపర్రు, 18న కలకుర్రు, 19న మానూరు, 20న పత్తికోళ్ళలంక, 21న పైడిచింతపాడు, 23 గుడివాకలంక, 27నమొండి కోడు, 28నపెదయాగన మిల్లి, 30న కోటేశ్వరదుర్గా పురం, 31న కాట్లంపూడి, జనవరి 2న కొక్కిరా యలంకలో రెవెన్యూ సదస్సు లు నిర్వహించ నున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు సదస్సులో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

● జీలుగుమిల్లి : ఈ నెల 11 నుంచి జనవరి 8వ తేదీ వరకు 31 గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యు సదస్సులు నిర్వహిస్తు న్నామని ఇన్‌చార్జి డీటీ ఉదయ్ భాస్కర్ తెలిపారు. రామాలయం, పంచాయతీ కార్యాలయం లేదా పాఠశాలల వద్ద సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి ఆర్థోపెడిక్ క్యాంపు

ద్వారకాతిరుమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి 14 వరకూ డాక్టర్ శ్రీనాథ్ కామినేని నేతృత్వంలో చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంపు నిర్వ హిస్తామని ట్రస్టు చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలున్నవారికి అత్యాధునిక వైద్య చికిత్స అందించేందుకు అమెరికా నుంచి కూడా వైద్యులు శస్త్రచికిత్సలు చేసేందుకు వైద్యులు వస్తారని వివరించారు. చెయ్యి, కాలు , కీళ్ల నొప్పులు, వంటి సమస్యలున్నవారు స్ర్కీనింగ్, చికిత్స కోసం పాత రిపోర్ట్స్ తెచ్చి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. వివరాలకు 83744 45108, 79016 95176 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుడివాకలంక సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా చాటపర్రు సబ్‌స్టేషన్ నుంచి గుడివాకలంక సబ్‌స్టేషన్‌లో పీటీ మార్పుకు సంబంధించి ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మ్యారావుగూడెం, కేడీ పురం, మొండికోడు, పత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, కొక్కిరాయలంక, కోమటిలంక, పెదయాగనమిల్లి, చినయాగనమిల్లిలో సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ ఈఈ ఆపరేష న్ సర్కిల్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

త్వరలో సోషల్ ఆడిట్

దెందులూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 పంచాయతీలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.30 కోట్లకు సంబంధించి సోషల్ ఆడిట్ జరగనుందని ఎంపీడీవో శ్రీలత, ఉపాధీ ఏపీవో దవరథరామ్‌జీ తెలిపారు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులను, కొవ్వలి, పోతునూరుల్లోని మీని గోకులం షేడ్లను మంగళవారం వారు పరిశీలించారు. త్వరలో సామాజిక తనిఖీ జరగనుందని ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులను, పని వివరాలను క్రమ పద్ధతిలో ఫైల్ చేసుకుని ఉంచుకోవాలని సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఉంగుటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : బాదంపూడిలో ఉపాధి నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ పరిశీలించారు. కార్యదర్శి కేవీ గిరిధర్, ఇంజనీరింగు అసిస్టెంటు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

13 నుంచి

సీపీఎం జిల్లా మహాసభలు

కుక్కునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బి.శ్రీను పిలుపునిచ్చారు. కుక్కునూరులో మంగళవారం జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. కార్మికులు, నిర్వాసితులు, ప్రజలందరూ హాజరుకావాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, సాయికిరణ్, ఎం.బాబు, వి.భాష, లక్ష్మణరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు : సీపీఎం జిల్లా మహాసభలకు వాల్‌పోస్టర్లను పెదపాడులోని నర్రా అంజనేయులు భవనం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని సభలను విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ కోరారు.

సర్ సీఆర్ రెడ్డి జయంతి

ఏలూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్ కట్టమంచి రామలింగారెడ్డి(సీఆర్‌రెడ్డి) 145వ జయంతిని మంగళవారం సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఆవరణలోని సీఆర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళ్లుల ర్పించారు. అనంతరం కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటి ఉపకులపతిగా ఈ ప్రాంతానికి ఆయన అందించిన సేవలను వివరించారు. సీఆర్ రెడ్డి అనుమతితోనే ఏలూరులో డిగ్రీ కళాశాలను ప్రారంభించామని, ఈ క్రమంలో ఆయనపై గౌరవంతో సీఆర్ఆర్ విద్యా సంస్థలన్నింటికీ ఆ మహనీయునిపేరును కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రామరాజు, వైస్‌ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ వై.బాబు, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పూల అలంకరణ

పెదపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాల సాంస్కృతిక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పూలు, కూరగాయలు, పండ్లతో అలంకరణ, మైమ్, మోనో, మిమిక్రీ పోటీలు నిర్వహించారు. వివిధ రకాల పూలు, పండ్లతో విద్యార్థుల అలంకరణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పూల అలంకరణలో వై.హేమశ్రీ, కూరగాయల అలంకరణలో టి.హర్షిత మొదటి బహుమతులను అందుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా స్వర్ణకుమారి, ఝాన్సీలక్ష్మీ, సుజనివాణి వ్యవహరించారు.

రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో చిన్నారుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలోని శ్రీఆనం కళాకేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో స్థానిక శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థినిలు హర్షిక, పూర్విక ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవశం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను రీజనల్ ఇన్‌చార్జి ఉదయ భాస్కర్, జోనల్ కోఆర్డినేటర్ కవితారాజేశ్వరి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏవో కె.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కృష్ణమాచార్యులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారి ఇరువురు మాట్లాడుతూ పర్మినెంట్ కార్మికులకు యూనిఫాం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు, భోగిపండుగ రోజు ఇవ్వాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెలకు రూ.32 వేలు వేతనం ఇవ్వాలన్నారు. పి.నాగబాబు, శివకుమార్, దుర్గాప్రసాద్, బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

లారీ, ఆటోలు నిలుపుదలకు స్థలం కేటాయించాలి

చింతలపూడి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో లారీలు, మినీ లారీలు, ఆటోలు నిలుపుకునేందుకు ప్రభుత్వం స్థలం కేటా యించాలని మహాత్మాగాంధీ లారీ ఆటో ట్రాక్టర్ కార్ ఎలక్ట్రీషియన్ మెకానిక్ యూనియన్ అధ్యక్షు లు టి.శివనాగరాజు విజ్ఞప్తి చేశారు. యూనియన్ సమావేశం మంగళవారం చింతలపూడిలో జరిగింది. సమావేశంలో శివనాగరాజు మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే వాహనాల రద్దీ పెరిగిందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తమ వాహనాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. టి.అప్పారావు, టి.నాగ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపవర్గీకరణపై ఏకసభ్య కమిషన్

ఏలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపవర్గీకరణపై విచారణ చేయటానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం, విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం మొదటి అంతస్తులో ఏర్పాటు చేశామన్నారు. ఉప వర్గీకరణ అంశాన్ని తెలిపేందుకు వినతిపత్రాలు, ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జనవరి 9వ తేదీ వరకు అందచే యవచ్చునని తెలిపారు. రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా పంపవచ్చన్నారు.

హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

ఏలూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వంగూరు జడ్పీ హైస్కూలును మంగళవారం డీఈవో వెంకటలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కూలు ఆవరణలో బాలబాలికలు అస్తవ్యస్థంగా కూర్చోవడాన్ని గమనించి హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇటీవల జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో తల్లితండ్రులకు అందజేయాల్సిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో సమాచారాన్ని అసమగ్రంగా నమోదుచేయడాన్ని గమనించిన డీఈవో ఇప్పటికీ ఆ పొరపాటును సరిదిద్దకపోవడంతో మందలించారు. వర్క్ బుక్‌లు సగంమేరకే రాసి ఉంచడం, అధికారులు తనిఖీలకు వచ్చినపుడు చూపించాల్సిన చెక్‌లిస్టులను సైతం పూర్తిస్థాయిలో సిద్ధం చేయకపోవడంపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ లోపాలన్నింటినీ వెంటనే సరిదిద్దుకుని నివేదికను డీఈవో కార్యాలయానికి పంపాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

అన్న సమారాధన

ద్వారకాతిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలలో సుబ్రహ్మణ్య షష్టిని పురస్కరించుకుని ఆఖరిరోజైన మంగళవారం పుట్టవద్ద భారీ అన్నసమారాధన జరిగింది. భక్తులు, స్థానికులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

పత్తి తీతలో జాగ్రత్తలు పాటించాలి



పత్తి తీతలో జాగ్రత్తలు తెలుపుతున్న ఏవో

బుట్టాయగూడెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చెట్ల నుంచి పత్తిని తీసేటపుడు రైతులు ఎండిన ఆకులు ఇతర చెత్త కలవకుండా జాగ్రత్తలు పాటించాలని ఏవో డి.ముత్యాలరావు తెలిపారు. మంగళవారం అంతర్వేదిగూడెం, విప్పలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, పొగాకు, అపరాల నాట్లు వేస్తున్నట్లు తెలిపారు. వరి, మొక్కజొన్న, అపరాల పంటలకు బీమా చేస్తామన్నారు.

● టి.నరసాపురం : సాగులో సేంద్రియ ఎరువులు వినియోగించటం శ్రేయస్కరం అని చింతలపూడి ఏడీఏ బి.నాగకుమార్ తెలిపారు.వల్లం పట్లలో ఏవో సుమలతో కలిసి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. పి.శ్రీనివాస్, సి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



బిషప్ జయరావును సన్మానిస్తున్న విశ్వాసులు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శాంతియుతమైన సమాజాన్ని నెలకొల్పేందుకు ఏసుక్రీస్తు బోధనలను అనుసరించాలని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పోలిమేర అన్నారు. బిషప్స్ హౌస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బిషప్ జయరావుముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫాదర్ దిరిశిన ఆరోన్, ఫాదర్ జాన్ పీటర్, ఫాదర్ బేతంపూడి రాజు, కే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భూమి కేటాయింపు



భూమి కేటాయింపును పరిశీలించేందుకు వచ్చిన జేసీ

ద్వారకాతిరుమల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ జగన్నాథపురం లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి 30 ఎకరాలు భూమి కేటాయించేందుకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఐఎస్ జగన్నాథపురం గ్రామానికి మంగళవారం విచ్చేశారు. సదరు రెవెన్యూ గ్రామంలో ఈ భూమి ఎక్కడ ఇవ్వాలన్న దానిపై పరిశీలన చేశారు. గ్రామ రికార్డులు, మ్యాప్‌లను చూశారు. దేవాలయానికి ఎక్కడ అనుకూలమైన భూమి ఉంది అన్న అంశంపై అధికారులతో చర్చించారు. ఆలయ అభివృద్ధి కోసం దేవస్థానానికి భూమి కేటాయిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఆస్పత్రి గేటు వద్ద ఆటోలు

అడ్డుగా పెడితే కఠిన చర్యలు

ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రికి అత్యవసర పరిస్థితుల్లో వస్తూ ఉంటారని అలాంటి వారికి మెయిన్‌గేటు దగ్గర ఆటోలు అడ్డులేకుండా క్రమ పద్ధతిలో పెట్టుకోవాలని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ డ్రైవర్లకు సూచించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఏలూరు ప్రభుత్వాస్పత్రికి ఒక కేసు దర్యాప్తు కోసం రాగా అత్యవసర విభాగం మెయిన్ గేటు వద్ద ఆటోలు అడ్డుగా ఉండడాన్ని గమనించారు. అక్కడ ఉన్న స్టాండ్ ఆటో డ్రైవర్లను పిలిపించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. మెయిన్‌గేటు దగ్గర వాహనాలు అడ్డుపెడితే సహించేది లేదన్నారు. ఏ ఆటో అయినా అడ్డుగా ఉంటే కేసు నమోదు చేస్తామన్నారు. డీఎస్పీతో పాటు టూటౌన్ సీఐ, ఎస్‌ఐలు వైవీ రమణ, నాగ కల్యాణి పలువురు పాల్గొన్నారు.

స్కూల్ లాగిన్‌లకు రేటింగ్స్

ఏలూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మౌలిక సదుపాయాలు, ఉత్తమ ఫలితాల ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఇచ్చిన రేటింగ్‌ను మంగళవారం విడుదల చేసింది. అయితే ఈ రేటింగ్‌ను పాఠశాలల వారీగా మాత్రమే తెలుసుకునేలా పరిమితులు విధించింది. ఆ ప్రకారం స్కూల్ లాగిన్‌లకు రేటింగ్‌ను నేరుగా ప్రభుత్వం పంపిందని, పాఠశాల హెచ్‌ఎం లాగిన్‌ను ఓపెన్ చేసి రేటింగ్‌ను చూసుకునే వెసులుబాటు కల్పించిందని జిల్లా విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకిచ్చిన రేటింగ్స్‌ను జిల్లాస్థాయిలో సింగిల్ పాయింట్‌లో సమాచారం తెలుసుకునే వీలులేకుండాపోయిందని రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ దక్కలేదని ఇంతకుముందు వార్తలు వచ్చాయి. జిల్లాలో మొత్తం 1788 ప్రభుత్వ పాఠశాలలున్నాయి.

ఐదుగురు అధ్యాపకులకు డాక్టరేట్ పట్టాలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వివిధ అంశాల్లో చేసిన పరిశోధనలకుగాను స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో పని చేస్తున్న ఐదుగురు సీనియర్ అధ్యాపకులు డాక్టరేట్ పట్టాలు పొందారు. వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మీడియాకు తెలిపారు. 'మ్యాథమెటికల్ అప్లికేషన్ ఇన్ మోడలింగ్ అండ్ యుటిలైజేషన్ ఆఫ్ రోబోట్స్ ఇన్ సిట్యుయేషన్ ఆఫ్ పాండేమిక్' అనే అంశంపై పీజీ కోర్సుల డైరెక్టర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సిస్టర్ సుశీల డాక్టరేట్ పట్టాను పొందారు. 'పాపల్ ఎన్‌సైక్లికల్స్ సోషియో ఎన్విరాన్‌మెంటల్ ఎథిక్స్ రివ్యూ ఆఫ్ ద పీరియడ్(1891-2020)' అనే అంశంపై వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, సమకాలీన రచయిత్రులు కవితాకేన్, నేటిడ్ రాసిన 'భారత దేశం, గ్రీక్ పురాణాల రచనల్లో స్త్రీ గుర్తింపు' అనే అంశంపై ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు జి.దుర్గా వైష్ణవి డాక్టరేట్ పట్టాలను పొందారు. 'పాలలో మైక్రో ప్లాస్టిక్‌లను గుర్తించడం, వాటి వర్ణన' అనే అంశంపై పరిశోధనలకుగాను కళాశాల ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం అధ్యాపకురాలు ఎం.షారోన్ సుష్మ, ప్రవాస సాహిత్యకారులు చిత్రబెనర్జీ దివాకరుని అమ్మండ ఎలియట్ రచనల్లో 'పురాణాలు, జానపద సాహిత్యం' అనే అంశంపై పరిశోధనలకు ఆంగ్ల విభాగం అధ్యాపకురాలు డి.మణి భాగ్యశ్రీ డాక్టరేట్ పట్టాలను పొందారని వివరించారు.

హెల్మెట్ ధరించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపే కళాశాల విద్యార్థులు విధిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ సూచించారు. వట్లూరులో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపే ప్రతి విద్యార్థి డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలని, మోటారు వాహన తనిఖీ అధికారులు జి ప్రసాదరావు, జగదీష్, పి.నరేంద్రబాబు, ప్రిన్సిపాల్ మురళీ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

త్రిబుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేయకూడదని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ అన్నారు. అన్నారు. వాహన నిబంధనలు అతిక్రమి స్తే కఠిన చర్యలతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు.

మాలల సింహగర్జ పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన తాడేపల్లి డాక్టర్ అంబేద్కర్ వెల్ఫేర్ భవన్‌లో మాలల మహాగర్జన నిర్వహిస్తున్న మాల ఉద్యోగుల సం ఘం గౌరవ అధ్యక్షులు బేతాళ సుదర్శన్ తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్దమాలల మహాగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యక్షులు కుటుంబరావు, చిత్రా నవీన్‌కుమార్, కె.ఆనంద్ కుమార్, కె.రాజారావు, కాకర్ల దొరబాబు, సాయిబాబా, బి.నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

శ్రీపుష్ప యాగోత్సవం



ద్వారకాతిరుమల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఉపాలయమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు అర్చకులు క్షీరాభిషేకం జరిపారు. సాయంత్రం శ్రీపుష్పయాగోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఉయ్యాలలో ఉంచి పవళింపు సేవా కార్యక్రమాన్ని వేడుకగా జరిపారు.

సభలను జయప్రదం చేయండి

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14,15 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50వసంతాల సభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ పిలుపునిచ్చారు. ప్రియదర్శిని కళాశాలలో కరపత్రాలను విడుదల చేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి బి.బాబురావు, జిల్లా కమిటీ సభ్యుడు కె.సత్యనారాయణ, నూజివీడు డివిజన్ కార్యదర్శి కె.రాము, కాటయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి చర్యలు

పెదపాడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాల ద్వారా ఇచ్చే రుణాలను సకాలంలో తిరిగి డ్వాక్రా సంఘాల మహిళలకు జమ చేయాలని, తద్వారా ఆయా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ, ఇన్‌చార్జి జడ్పీ సీఈవో విజయకుమార్ తెలిపారు. పెదపాడులోని వెలుగు కార్యాలయంలో దెందులూరు క్లస్టర్‌లోని డీఆర్‌డీఏ అధికారులతో డ్వాక్రా సంఘాలకు సంబంధించి రుణాలు మంజూరు అంశంపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతి నివేదికలను పరిశీలించి, స్త్రీ నిధి, ఇతర రుణాలను త్వరితగతిన సభ్యులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్‌కు అనుసంధానమైన ఇన్నర్ వీల్ జంగారెడ్డిగూడెం గోల్డ్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎంపిక చేశారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డి.కృష్ణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షురాలిగా ఎన్.మాధురి, కార్యదర్శిగా పద్మజ్యోతి, కోశాధికారిగా ఆదిలక్ష్మి, మరో 14 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు కృష్ణ తెలిపారు. బి.సత్యవతి, వహిద, శైలజ, సువర్చల పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు అందజేత

ఏలూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే ఇన్నర్‌వీల్ క్లబ్ లక్ష్యమని చైర్మన్ విశాలాక్షి అన్నారు. క్లబ్ చైర్మన్ విశాలాక్షి విజిట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం లేడీస్ క్లబ్ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. డాక్టర్ జి.లలిత సహకారంతో ఇంజినీరింగ్ విద్యార్థికి సైకిల్, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రానికి సావిత్రి, జానకి, భవానీ,సారథి సహకారంతో కుట్టు మిషన్లు అందచేశారు. అలాగే క్లబ్ సభ్యుల సహకారంతో దొండపాడులోని పరివర్తన్ బధిరుల విద్యార్థులకు 50 కుర్చీలు అందచేశారు. సెక్రటరి లక్ష్మిసర్వేష్, డిస్ట్రిక్ చైర్మన్ ఎ.లక్ష్మిశ్రీనివాస్, పాస్ట్ ట్రెజరర్ సరితాలునాని, పీడీసీలు గుడిమెట్ల అచ్యుత, డాక్టర్ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగంపై విచారణ

టి.నరసాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగం జంగారెడ్డిగూడెం డీఎల్పీవో రజావుల్లా, ఈవోపీఆర్డీలు ఫిర్యాదుదారు గుండు పాండురంగతో కలిసి మంగళవారం విచారణ చేపట్టారు. ఆక్రమణకు గురి కాబడిన సాయినగర్ వాటర్ ట్యాంక్ స్థలం, బల్క్‌మిల్క్ సెంటర్ స్థలం, సూరంపూడిలో బొమ్మగాని బాలకృష్ణ పొలం నుంచి వడ్లాని వెంకటేశ్వరరావు పొలం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టకుండానే చేసినట్లు బిల్లులు చేసుకున్న రోడ్‌ను పరిశీలించారు. వీటిపై త్వరితగతిన నివేదికలు తయారుచేసి డీపీవోకి పంపనున్నట్లు వారు తెలిపారు.

క్రైమ్ కార్నర్

బెల్లపు ఊట ధ్వంసం

కుక్కునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని పలుచోట్ల మంగళవారం దాడులు జరిపారు. వేలేరు గ్రామం సమీపంలో పాములేరు వాగు వద్దున సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యిలీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడిలో సీఐ కే.శ్రీనుబాబు, ఎస్సై ఎస్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

లింగపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు నడిచే దారి విషయమై గొడవ పడి ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సేవా మార్తమ్మ, సేవా మౌనిక తమ ఇంటి ముందు నడక దారి విషయంలో గొడవపడి పరస్పరం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్లు ధర్మాజీగూడెం ఎస్‌ఐ కె.వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అభివృద్ధికి మానవ హక్కుల చట్టం తోడ్పాటు



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవ అభివృద్ధికి జాతీయ మానవ హక్కులు చట్టం ఒక మైలురాయి వంటిదని ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో ప్రధానమైనదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. సత్రంపాడులో ఉన్న విద్యా వికాస్ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి రత్న ప్రసాద్ మాట్లాడుతూ మానవ హక్కులకు గౌరవం లేనప్పుడు స్థిరమైన అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఏలూరు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, పేనల్ లాయర్లు కె.కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ గిరిబాబు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సమావేశం జరిగింది. ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి హెప్సీబా, రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మానవ హక్కుల బాటసారిగా ఉన్న హర గోపాల్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్డియ్య, మణీంద్రరావు, ఆయేషా, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి సి.మధుబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఎన్.అశోకబాబు, ఎఎస్ఐ కిషోర్‌కుమార్, న్యాయవాది దేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరిస్తాం

ఎంపీ పుట్టా మహేశ్ కుమార్



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైల్వేలకు సంబంధించిన సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రి అంజని వైష్ణవ్‌కు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ రైల్ భవన్‌లో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసి మహేష్ వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలను కలుపుతూ గుడివాడ జంక్షన్, నూజివీడు, మదిర మీదుగా నూజివీడు విస్సన్నపేటల మధ్య కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేయాలన్నారు. 96 కిలోమీటర్ల ఈ రైలు మార్గం ఏపీ, తెలంగాణల మధ్య ముఖ్యమైన లింకుగా ఉపయోగపడుతుందన్నారు. మచిలీపట్నం పోర్టు, ఇండియా కోల్‌ఫీల్డ్, ఏపీఎస్ ఐడీసీ సెజ్ నుంచి తలెత్తే ట్రాఫిక్ సమస్యను అధిగమించటం కోసం ఈ రైల్వే లైన్ దోహదం చేస్తుందన్నారు. నూజివీడు రైల్వేస్టేషన్ ఆధునికీకరణలో భాగంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు స్టేషన్‌లో ఈస్ట్ కోస్ట్ రైలు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సత్తుపల్లి మీద భద్రాచలం, కొవ్వూరు బ్రాడ్‌గేజ్ మార్గం మంజూరు చేయాలన్నారు. ఈ లైన్ వలన హైదరాబాదు, విశాఖపట్నం మధ్య 150 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. కైకలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం రాయగడ, తిరుపతి, కాకినాడ పాసింజర్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను చేబ్రోలులో హాల్ట్ ఏర్పాటు చేయాలన్నారు. నూజివీడు రైల్వేస్టేషన్‌లో గౌతమి, గోదావరి. విశాఖ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను హాల్ట్ ఏర్పాటు చేయాలని కోరారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : శబరిమలై యాత్రికులను దృష్టిలో పెట్టుకుని విజయవాడ డివిజన్ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్ళను నడపనున్నారు. రైల్ నెంబర్ 07173 కాకినాడ పోర్టు - కొల్లాం బుధవారం రాత్రి 23.50 నిముషాలకు కాకినాడ పోర్టులో బయలుదేరనుంది. ఈనెల 11,18, 25 తేదీలలో నడపనున్నారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు కొల్లాం చేరుకోనుంది. రైల్ నెంబర్ 07174 కొల్లాం - కాకినాడ పోర్టు శుక్రవారం రాత్రి 8.40 నిము షాలకు కొల్లాంలో బయలుదేరి శనివారం సాయంత్రం 4 గంటలకు కాకినాడ పోర్టుకు చేరుకోనుంది. ఈ రైలును ఈనెల 13, 20, 27 తేదీలలో నడపనున్నారు. కాకినాడ టౌన్, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, తిరుపతి, చిత్తూరు, కాట్పాడి తదితర స్టేషన్లలో ఆగనున్నాయి.

రైళ్ల దారి మళ్ళింపు :

విజయవాడ దక్షిణమధ్య రైల్వే పరిధిలోని గన్నవరం - ముస్తాబాద్, చేబ్రోలు - బాదంపూడి స్టేషన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్‌ల నిర్వహణ నేపథ్యంలో రైళ్ళను దారి మళ్ళిస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైళ్ళు తాడేపల్లిగూడెం, ఏలూరు మీదుగా కాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా మళ్ళించనున్నట్లు తెలిపారు.

రైల్ నెంబర్ (12863) హౌరా- బెంగళూరు ఈనెల 11, 13, 14, 16, 17, 20, 21, 23, 24 తేదీలలో , (13351) ధన్‌బాగ్ - అల్పుజా 10, 16, 17, 20, 21,23, 24 తేదీలలో, (22837) హట్యాయ్ - ఎర్నాకుళం 16, 23 తేదీలలో , (12835) హట్యాయ్ -యర్నాకుళం 10, 17, 24 తేదీలలో , (12889) టాటానగర్ - బెంగళూరు ఈనెల 20వ తేదీ, (18637) హట్యాయ్ - బెంగళూరు ఈనెల 21వ తేదీ (11019) ముంబై - భువనేశ్వర్ ఈనెల 11, 13, 14, 25, 27, 28, 30 తేదీలలో, (17239) గుంటూరు- విశాఖపట్టణం ఈనెల 26, 29,31 తేదీలలో దారి మళ్లిస్తున్నట్టు తెలిపారు.

నలుగురు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

» 88 లక్షల 73 వేల 500 రూపాయలు విలువైన చోరీ సొత్తు స్వాధీనం

» నగదు 63 వేల రూపాయలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు

ఏలూరు క్రైం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇళ్ళ దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు మొత్తం 88 లక్షల 73 వేల 500 రూపాయలు విలువ కలిగిన బంగారు, వెండి వస్తువులు, 63 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్, అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌లు పాల్గొ న్నారు. కేసుల వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఏలూరు జిల్లాలోని గణపవరం, భీమడోలు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి, ఆకివీడు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డ ముఠా కోసం జిల్లా పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. భీమడోలు సీఐ యుజె విల్సన్, నిడమర్రు సీఐ ఎంవి సుభాష్, ఎస్ఐలు సుధాకర్, మణికుమార్, సూర్యభగవాన్, ఎన్ వీర ప్రసాద్ వారి బృందాలు గాలింపు చేపట్టారు. ఈ నేరాలకు పాల్పడిన ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన కర్రె డ్డి మణికంఠ సాయి శ్రీనివాస్ (23), యార్లపాటి మౌనిసన్ని అలియాస్ సన్ని (23), పెద్దా హేమ కుమార్ అలియాస్ హేమంత్, పెద్దిరెడ్డి రత్న శేఖర్ (20)లను అరెస్టు చేశారు. వీరు తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి వేళ వాటిని పగలుగొట్టి నేరాలకు పాల్పడుతున్నారు.వీరిని అదుపులోకి తీసుకుని విచారించి 700 గ్రాముల బంగారపు వస్తువులు, 7 కేజీల వెండి వస్తువులు, 63 వేల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్పీ చెప్పారు.


పని మనిషే నేరస్తురాలు

ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ 13వ రోడ్డులో ఎర్రంశెట్టి సురేష్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన తల్లికి అనారోగ్యం కావడంతో సత్రంపాడునకు చెందిన చింతా అనిత వెంకటలక్ష్మి అలియాస్ అనిత (45) అనే ఆమెను పనిమనిషిగా పెట్టుకున్నారు. రెండున్నర సంవత్స రాల నుంచి ఎంతో నమ్మకంగానే పనిచేస్తుంది. ఆమె గతంలో అనిత వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారం చేసి అప్పులపాలై వడ్డీలు కట్టలేక ఇంటి పనికి చేరింది. ఆ ఇంట్లో పనిచేస్తూ అనుపాను కనుగొని బీరువాలో ఉన్న బంగారపు వస్తువులను ఇంటి వాళ్ళు లేని సమయంలో తస్కరించాలని ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రెండు నెలలుగా కప్‌బోర్డులో ఉన్న తాళాలు తీసుకుని బీరువా తెరచి అప్పుడొక వస్తువు అప్పుడొక వస్తువు ఈ విధంగా మొత్తం 302 గ్రామాలు బంగారాన్ని అపహరించింది. ఈ సంఘటనపై సురేష్ త్రి టౌన్ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితురాలిని విచారించి మొత్తం బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో అనితను మంగ ళవారం ఉదయం అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారం విలువ 18 లక్షల 73 వేల 500 రూపాయలు ఉంటుందని వెల్లడించారు.

అధికారులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు

అంతర్‌జిల్లా దొంగలను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందికి, ఇంట్లో పనిచేస్తూ ఆ ఇంట్లోని బంగారాన్ని అపహరించిన మహిళను అరెస్టు చేసిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ కిశోర్ నగదు రివార్డులను, ప్రశంసా పత్రాలను అందించారు. అందుకున్న వారిలో ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, భీమడోలు సీఐ యుజె విల్సన్, నిడమర్రు సీఐ ఎన్‌వి సుభాష్, త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, భీమడోలు ఎస్ఐ సుధాకర్, గణపవరం ఎస్ఐ మణికుమార్, చేబ్రోలు ఎస్ఐ సూర్యభగవాన్, నిడమర్రు ఎస్ఐ వీరబాబు, ఏలూరు త్రీ టౌన్ ఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుళ్ళు ఉన్నారు.

గంజాయి ముఠా గుట్టు రట్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీవేద

మొగల్తూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు మండలంలో గంజాయి ముఠా గుట్టు రట్టు అయ్యింది. మంగళవారం లిక్విడ్ గంజాయి కలిగి ఉన్న 10 మంది యువకులు అరెస్ట్ కాగా మరొకరి కోసం గాలిస్తున్నట్టు నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద తెలిపారు. మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టి ఈ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో పది మంది యువకులు అనుమానాస్పదంగా ఉన్నారనే సమాచారంతో సీఐ దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.వాసు సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం చోరంపూడి గ్రామానికి చెం దిన పొన్నమండ కృష్ణప్రసాద్, అదే గ్రామానికి చెందిన రామాని కుసుల్ దుర్గ, మచిలీపట్నంలోని గిలకలదిండికి చెందిన వల్లభుని గోపాల కృష్ణ, రామాని మనోజ్ కుమార్, మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెం దిన దొంగ ప్రసాద్, నరసాపురం పట్టణానికి చెందిన కొల్లాటి వాసుదేవ్, జోశ్యుల సుబ్రహ్మణ్యం విశ్వేశ్వర, కర్రి ఆదిత్య వినాయక పవన్ కుమార్, మొగల్తూరు గ్రామానికి చెం దిన చదలవాడ కృపావరం, ఇరగవరం మం డలం కాకిలేరుకు చెందిన వీరవల్లి సుధీర్‌అను అరెస్ట్ చేసి 135.198 మిల్లీ గ్రాముల బరువు గల 19 సీసాల లిక్విడ్ గంజాయి, 8 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. గంజాయి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.95వేలు ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా అరెస్ట్ అయిన పది మందిలో ఆరుగురిపై పలు స్టేషన్‌లలో కేసులున్నాయన్నారు.

నేత్రపర్వం.. సుబ్రహ్మణ్యేశ్వరుడి జల విహారం



పుష్కరిణిలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ముదినేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): షష్టి ఉత్సవాల్లో భాగంగా సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జల విహారం మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస తెప్పపై స్వామి, అమ్మ వార్లు జలవిహారం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న జనం స్వామి తెప్పోత్సవాన్ని తిలకించారు. అర్చకులు గూడూరు శివరామకృష్ణ, తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు నిర్వహించా రు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్ఐ వీరభద్రరావు పోలీసు బందోబస్తు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, షష్టి ఉత్సవ అధికా రి చందన, ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఈవోలు సింగనపల్లి శ్రీనివాసరావు, పి.వై.నాయుడు, ఉత్స వ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్, పరసా రమేష్, వెనిగళ్ల సురేష్, సోమమ్మ, దగాని నాగ లక్ష్మి, వీరమల్లు నరసింహారావు, సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, చల సాని జగన్మోహనరావు, కొత్తూరి విఠల్, కోట ప్రోలు కృష్ణారావు, వీరంకి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద 200 మంది విద్యార్థుల భగవద్గీత పారాయణ ఆకట్టుకుంది. విద్యార్థులకు దేవస్థానం ఏసీ గంగా శ్రీదేవి బహుమతులు అందజేశారు.

జాతీయ రహదారి విస్తరణకు చర్యలు : జేసీ



భుజబలపట్నంలో జాతీయరహదారి పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

కైకలూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణకు కృషి చేస్తున్నామని, ప్రజలు, రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. భుజబలపట్నం, గోపవరం గ్రామాల్లో 165వ జాతీయ రహదారి విస్తరణ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. భుజబలపట్నంలో నివాసాలకు ఇబ్బందులు లేకుండా రహదారి వెడల్పును కుదించినట్లు ఎన్‌హెచ్ అధికారులు జేసీకి వివరించారు. 2021 నుంచి పలుచోట్ల రైతులు కోర్టులు ఆశ్రయించడంతో పనులు ఆలస్యమైనట్లు తెలిపారు. కోర్టు పరిధిలో వివాదాలన్నీ తొలగినట్లు వివరించారు. భుజబలపట్నంలో రహదారి విస్తరణకు పలు గృహాలకు ఇబ్బందులు కలుగుతోంది. స్వచ్ఛందంగా రహదారి అభివృద్ధికి సహకరిస్తామని స్థానికలు హామీ ఇచ్చారు. జేసీ ధాత్రి రెడ్డి మాట్లాడుతూ పామర్రు నుంచి దిగమర్రు వరకు మూడు భాగాలుగా విభజించి ముగ్గురు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారని, త్వరలోనే పనులను ప్రారంభిస్తారన్నారు. గృహ యజమానులకు ప్రభుత్వం నుంచి పరిహారం కావాల్సి ఉంటే మూడు రోజుల్లో సమగ్ర వేదికను అందజేయాలని ఎన్‌హెచ్ అధికారులను జేసీ ఆదేశించారు. శింగాపురం నుంచి భుజబలపట్నం వరకు పనులు జరిగేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడైనా భూసమస్య ఉంటే వెంటనే పరిష్కరిస్తామన్నారు. భూములు అప్పగించిన రైతులు, ఇళ్ల యజమా నుల నుంచి డాక్యుమెంట్లను స్వాధీనం చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్ డీఈ సత్యనారాయణ, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, పెన్మెత్స త్రినాథరాజు, కృష్ణంరాజు, పేరిచర్ల ప్రసాదరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి లక్ష్మి

హక్కులను పరిరక్షించుకోవాలి

కైకలూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కులకు విఘాతం కలిగితే చట్ట రీత్యా కఠినమైన చర్యలు తీసుకోబడతాయని కైకలూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి వీవీఎస్‌వీ.లక్ష్మి అన్నారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం మానవహక్కులపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచి మానవ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికి అందకపోతే కోర్టులను ఆశ్రయించవచ్చన్నారు. మానవ హక్కులపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, స్కూల్ హెచ్‌ఎం ఎస్.లక్ష్మీరాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.



నృత్య పోటీల్లో చిన్నంపేట విద్యార్థినుల ప్రతిభ

చాట్రాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్టెప్ అప్ డాన్స్ అకాడమీ 14వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల స్థాయిలో సత్తుపల్లిలో ఇటీవల నిర్వహించిన డాన్స్ పోటీలలో జానపద నృత్య విభాగంలో మండలంలోని చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ సీనియర్ విద్యార్థినిలు ద్వితీయ బహుమతి గెలుపొందారు. జూనియర్ విభాగంలో కూడా ఇదే పాఠశాల విద్యార్థినులు కన్సొలేషన్ బహుమతి అందుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పి శ్రీనివాసరావు అభినందించారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన

చాట్రాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్రావు మాట్లాడుతూ మనిషి మనిషిగా బ్రతకటం, ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా జీవించటం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం లక్ష్యం అన్నారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, పిల్లల హక్కులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

చాట్రాయి, డిసెంబరు 10(చాట్రాయి): చనుబండ సీఎస్ఐ చర్చి, పెంతెకోస్తు చర్చిలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సెమీ క్రిస్మస్ కేకులు కట్ చేసి పంపిణీ చేశారు. అ సందర్భంగా సీఎస్ఐ చర్చి రెవరెండ్ ఫాదర్ పాల్, పెంత్‌కోస్తు చర్చి పాస్టర్ చౌదరి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధించిన శాంతి, కరుణ, సోదర భావం సిద్ధాంతాలు విశ్వ మానవాళికి ఎప్పటికీ అనుసరణీయమేనని అన్నారు.

పంచాయతీ కార్యదర్శుల మండల కమిటీ

ముసునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ నూతన కమిటీ ఎంపిక ఈవోపీఆర్డీ బి.ఎ.సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం ముసునూరులో జరిగింది. అధ్యక్షులుగా వేల్పుచర్ల గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులుగా గోపవరం కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా అక్కిరెడ్డిగూడెం కార్యదర్శి కె.విద్యాధరరావు, ప్రధాన కార్యదర్శిగా రమణక్కపేట కార్యదర్శి పి.నాగబాబు, కల్చరల్ సెక్రటరీగా ఎం.నీరజ, మహిళా కార్యదర్శిగా కె.సుజాత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.ధర్మావతి, పబ్లిసిటీ సెక్రటరీగా కె.నాగశిరోమణి ఎన్నికయ్యారు.



భుజబలపట్నం, మండవల్లిలో సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీసీ కెమెరాలతో నేరాలకు అడ్డుకట్ట

కైకలూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిచితులు కనిపిస్తే వివరాలను సేకరించాలని కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ అన్నారు. భుజబలపట్నం, కొల్లేరు గ్రామాల్లో సీసీ కెమెరాల ఉపయోగాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రధాన కూడళ్ళు, రద్దీ ప్రాంతాల్లో దుకాణాదారులు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలన్నారు. కెమెరాలతో నేరాలను అరికట్టడమే స్థానికుల కదలికలను కూడా గమనించవచ్చన్నారు. ఇళ్లలో చోరీలు జరిగినా కెమెరాల ఆధారంగా కేసును త్వరితగతిన పరిష్కరించేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

● మండవల్లి: సీసీ కెమెరాలతో నేరస్తులను పట్టుకోవచ్చని రూరల్ సీఐ రవికుమార్ అన్నారు. మండవల్లి ఆలయ ఆవరణలో మంగళవారం గ్రామపెద్దలు, వ్యాపారులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎక్కడైనా దొంగతనం జరిగితే 30-40శాతం మాత్రమే రికవరీ చేయగలమని, సీసీ కెమెరాల ఉంటే దోషులను గుర్తించే ఎక్కువ శాతం రికవరీ చేయగలమన్నారు. సీసీ కెమెరా 24గంటలు నిఘా ఉంటుందన్నారు. ప్రతీ గ్రామంలో ప్రధాన సెంటరులో సీసీ కెమెరా పెట్టుకోవాలని సూచించారు. ఎస్సై రామచంద్రరావు, మాజీ సర్పంచ్‌లు గుడివాడ చిట్టిబాబు, గంగుల ఆదినారాయణ, సామాజికవేత్త ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్, పలువురు పెద్దలు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రైతులు ఒప్పంద పత్రం తీసుకోవాలి

నూజివీడు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని ఏలూరు జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ అబీబ్‌బాషా తెలిపారు. పల్లెర్లమూడిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న రైతులు సంబంధిత సీడ్ కంపెనీల నుంచి ఖచ్చితంగా ఒప్పంద పత్రాన్ని తీసుకోవాలన్నారు. ప్రధాని ఫసల్ బీమాలో మొక్కజొన్నకు రూ.483 ప్రీమియం చెల్లించి ఎన్‌రోల్ కావాలని తద్వారా ప్రతికూల పరిస్థితుల్లో ఎకరానికి రూ.42 వేలు బీమా వర్తిస్తుందన్నారు. ఏడీఏ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో రోబోటిక్స్‌పై వర్క్‌షాపు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వక్తలు

నూజివీడు టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఐఐటీ హైదరాబాద్ సహకారంతో రోబోటిక్స్ ఫర్ అటానమస్ నావిగేషన్ సిస్టంస్‌పై వర్క్‌షాపును ప్రారంభించారు. ఆర్జీయు కేటీ వైస్ ఛాన్స్‌లర్ ఎం.విజయ్‌కుమార్, ఎఫ్రానిక్స్ సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ రామస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు, డ్రోన్స్ స్వయం ప్రతిపత్తి రోబోట్స్ రోబోటిక్స్‌లోని నూతన సాంకేతిక ద్వారానే సాధ్యమవుతున్నాయన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు



ముసునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ యువనేత ఉప్పలపాటి గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత మెగా కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడ వాసన్ కంటి ఆసుపత్రి వైద్యులు సుమారు 230మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 65మందికి కంటి ఆపరేషన్లు అవసరమని, వీరికి ఎన్టీఆర్ వైద్య సేవాలో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని వైద్యులు తెలిపారు.

పని భారం తగ్గించాలని వినతి



ఎంపీడీవో రాణికి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ముసునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్యదర్శులకు పని భారం, వత్తిడి తగ్గించాలని ఎంపీడీవో జి.రాణికి మండల పంచాయతీ కార్యదర్శులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పంచాయతీల్లో పని భారం అధికంగా ఉందని, దీనితోడు ఇళ్ళ సర్వేను కూడా కార్యదర్శులకు అప్పగించడం మరింత భారంగా మారి, వత్తిడికి గురవుతున్నట్లు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సుజాత, నీరజ, నాగబాబు, విద్యాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు పనుల నిలిపివేత

ఆగిరిపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి పంచాయతీకి పారిశుధ్య మకిలీ అంటుతుంది. ప్రతినెల 15వ తేదీ వరకు జీతాలు ఇవ్వటం లేదని తమకి ఇచ్చే అరకొర జీతాలు కూడా ఇలా ఆలస్యంగా ఇస్తే పనిచేయటం తమ వల్లకాదని పారిశుధ్య కార్మికులు తేల్చి చెప్తున్నారు. మంగళవారం రోడ్లు ఊడ్చకపోవడంతో వల్ల రోడ్లన్నీ మురికిగా తయారై ఎక్కడ చెత్త అక్కడ పోగులుపెరిగిపోయాయి. తమకు ఉన్న పాత బకాయిలు కూడా ఇవ్వాలని స్కేలు ప్రకారం జీతం ఇవ్వడం లేదని ఇవన్నీ ఇస్తేనే పనిలోకి వస్తామని కార్మికులు భీష్మించుకు న్నారు.



రోడ్లపై చెత్త, గన్నవరం రోడ్డులో మురుగు

చేపలు, రొయ్యల శాస్త్రీయ సాగుతో లాభాలు

కలిదిండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేపలు, రొయ్యల సాగులో శాస్త్రీయ పద్ధతులు అవలంబిస్తే తక్కువ పెట్టుబడిలో అధిక లాభాలు సాధించవచ్చని మత్స్యశాఖాధికారి రవికుమార్ అన్నారు. కొండంగి, మట్టగుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న చేపలు, రొయ్యల చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి మార్పు చేసి విద్యుత్ రాయితీ వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏవో విద్యాసాగర్, ఫిషరీష్ నూరెళ్ల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతు పనులు

కలిదిండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంక గ్రామాల్లో అధ్వాన రహదారుల మరమ్మతు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మల్లంపూడి నుంచి భాస్కరావుపేట మీదుగా మట్టగుంట వరకు సుమారు రూ.కోటితో పనులు చేపట్టారు. యడవల్లి నుంచి మట్టగుంట రహదారికి రూ.70 లక్షలతో పనులు జరుగుతున్నాయి. సంక్రాంతికి పనులు పూర్తి చేస్తామని ఆర్ అండ్ బి ఏఈఈ అరవింద్ తెలిపారు.

బాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ముదినేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో నిర్మించిన షిర్డి సాయిబాబా మందిరం వద్ద మంగళవారం ప్రతిష్టోత్సవ కార్యక్రమాలు ప్రారంభ మయ్యాయి. బుధవారం బాబా ప్రతిష్ఠ జరుగనున్న సందర్భంగా హోమం, పూజలు చేశారు. ఆసూరి రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో సూదాబత్తుల నాగమల్లేశ్వరరావు, బాలకృష్ణ, అడపాల నాగ ప్రసాద్ దంపతులు హోమం, ఇతర పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

మండవల్లి డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. గృహాలు, వాణిజ్య సముదాయాలు ఆక్వా చెరువులపై మీటర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 45 బృందాలు తనిఖీ చేశారు. 286 సర్వీసు మీటర్లలో అదనపు లోడు మొత్తానికి రూ.8.95లక్షలు జరిమానా విధించామని గుడివాడ ఈఈ జిబి శ్రీనివాసరావు చెప్పారు. విద్యుత్ చౌర్యం జరిగితే 9440812091, 9440812086 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. డీఈఈ బి రామయ్య, గాడిపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల నియామకం

ముదినేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల నియామక ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. అల్లూరులోని 94, 95 బూత్‌లకు అధ్యక్షులుగా దాసరి వెంకటేష్, నీలపాళ్ల సతీష్‌ను ఎన్నుకున్నారు. సత్యవోలు నాగలక్ష్మి, కోటప్రోలు కృష్ణారావు, నాయకులు కొల్లిపర నాగరాజు, బిబివి.నరసింహారావు, మొవ్వ పణి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మలింగం చెరువును అభివృద్ధి చేస్తాం

ఆగిరిపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మలింగం చెరువును రాష్ట్ర టూరిజం హబ్‌గా మారుస్తానని టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. మంగళవారం బ్రహ్మలింగం చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఆయన ఈ చెరువు రెండు జిల్లాలకు సరిహద్దు ప్రాంతమని ఇరుప్రాంతాల ఎమ్మెల్యేలైన పార్థసారధి, వెంకట్రావులతో మాట్లాడి తోటపల్లిను టూరిజం హబ్ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ బాలాజీ అన్నారు. నూజివీడు నియోజకవర్గ బీసీ నాయకుడు ఆరేపల్లి శ్రీనివాసరావుతో కలిసి గ్రామంలో దుగ్గిరాల బాలరావమ్మతల్లిని దర్శించి అనంతరం బ్రహ్మ లింగేశ్వర చెరువును పరిశీలించారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం



ముసునూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముసునూరు గ్రామంలో దేవర చెరువు సమీపంలో మంగళవారం గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం కనిపించడంతో రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి చుట్టు పక్కల పరిసరాలు, మృతదేహన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటాయని, అతని వద్ద ఊరు, పేరుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి ఎత్తు 5 అడుగులు, ఆరెంజ్ రంగు టీషర్ట్ మాత్రమే ధరించి ఉన్నాడు. రెండు రోజుల క్రితం మృతుడు మండలంలోని వలసపల్లి గ్రామంలో మతిస్థిమితం లేకుండా అటు, ఇటు తిరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. వృద్ధుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వారు, ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో కానీ, 9440796441 నెంబరును సంప్రదించాలని ఏఎస్సై నాగభూషణరావు తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

ముసునూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగ పిల్లలకు ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది పిల్లలకు డాక్టర్ ప్రశాంతి ఫిజియోథెరపీ చికిత్సను అందించి, వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.